JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రభాత జయభేరి
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
మేడ్చల్ - మల్కాజిగిరి । శుక్రవారం 27-02-2026
Medchal - Malkajgiri । Friday 27-02-2026
Follow: jayabherinews
సంపుటి : 02 । సంచిక : 272
పేజీలు : 8 । వెల : 5
Vol. 02 । Issue 272 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889 call me
jayabheripaper@gmail.com





# గరం.. నరం బేషరం

తెలంగాణ రాష్ట్ర తొలి గ్రూప్ -1, గ్రూప్ -2 అధికారులుగా ఎంపికై శిక్షణ పూర్తి చేసుకుని రాష్ట్ర పునర్ నిర్మాణంలో భాగస్వాములు కాబోతున్న నా యువ సోదర, సోదరీమణులతో MCRHRD ప్రాంగణంలో సమావేశమయ్యాను. ఈ సమావేశంలో యాంత్రికంగా కాదు... ఒక భావోద్వేగ బంధంతో పాల్గొన్నాను. ముఖ్యమంత్రిగా కాదు, ఆ యువ బృందానికి పెద్దన్నగా వెళ్లాను. పేదరికం నేపథ్యం నుంచి, తల్లిదండ్రుల చెమట బిందువుల శ్రమ నుంచి స్ఫూర్తి తీసుకుని ఈ యువ అధికారులు ఎంపికై సొంత గడ్డకు సేవ చేయబోతున్నారన్న ఆలోచన అద్వితీయమైన అనుభూతిని ఇచ్చింది. వీళ్ల టాలెంట్ ను తక్కువ చేస్తూ, ఆత్మగౌరవాన్ని అవమానిస్తూ కొన్ని దుష్టశక్తులు న్యాయ వ్యవస్థ ద్వారా వీళ్ల భవిష్యత్ ను చీకటి మయం చేయాలని చేసిన ప్రయత్నాలను ప్రజా ప్రభుత్వం అదే న్యాయపోరాటం ద్వారా ఎదుర్కొని, విజయం సాధించి, వాళ్ల జీవితాల్లో వెలుగులు నింపిన క్రమం నాకు తృప్తిని ఇచ్చింది. ఈ యువ అధికారుల బృందం "గరం, నరం, బేషరం" నానుడి తప్పు అని రుజువు చేసి, కొలువులో చేరిన నాడు ఏవిధమైన అంకిత భావంతో ఉంటారో, ఉద్యోగ విరమణ నాడు అంతే అంకిత భావంతో పేదలకు సేవ చేయాలని, చేస్తారని విశ్వసిస్తున్నాను.

**రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులకు హార్వర్డ్ యూనివర్సిటీ నిపుణులతో ఎగ్జిక్యూటివ్ క్లాసులు నిర్వహించడానికి సంబంధించి త్వరలోనే ఆ యూనివర్సిటీతో ఒక అవగాహన ఒప్పందం కుదుర్చుకోబోతున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోనే ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ నిర్వహించే విధంగా డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థతో ఒప్పందం చేసుకోవడానికి హార్వర్డ్ యూనివర్సిటీ సూత్రప్రాయంగా అంగీకరించిందని చెప్పారు.**

జయభేరి, హైదరాబాద్ :
గ్రూప్ I (271 మంది), గ్రూప్ II (175 మంది) ఉద్యోగాలు పొందిన అధికారులు MCRHRDI లో ఫౌండేషన్ కోర్సును పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. శిక్షణ సందర్భంగా నేర్చుకున్న విషయాలు, ఫీల్డ్ విజిట్ చేసిన సందర్భంగా తెలుసుకున్న

# ఖమ్మంలో కూల్చివేత



- **ఖమ్మంలో ఉద్రిక్త పరిస్థితులు**
- **అధికార పార్టీ నాయకులు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారు**

జయభేరి, ఖమ్మం, ఫిబ్రవరి 26 :
ఖమ్మం నగరాన్ని ఆనుకుని ఉన్నవెలుగుమట్ల భూదాన్ భూముల్లో నిర్మించుకున్న సుమారు 650 ఇళ్లను రెవెన్యూ అధికారులు భారీ పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేశారు. ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా, కనీసం ఇంట్లోని సామాన్లు సర్దుకోవడానికి కూడా సమయం ఇవ్వకుండా జేసీబీలతో గూడును నేలమట్టం చేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూలీ పనులు చేసుకుంటూ, అప్పులు చేసి కష్టపడి సంపాదించిన సొమ్ముతో ఒక్కో ఇటుక పేర్చుకుని నిర్మించుకున్న ఇళ్లు కళ్లముందే ధ్వంసమవుతుంటే మహిళలు, వృద్ధులు అడ్డంగా పడుతూ రోదించిన తీరు అక్కడి వారిని కలిచివేసింది. ఈ భూములు భూదాన్ బోర్డుకు చెందినవని, ఇవి ప్రభుత్వ పరిధిలోకి వస్తాయని అధికారులు పేర్కొంటున్నారు. గత ఎనిమిది నెలలుగా పేదలు ఈ భూమిలో గుడిసెలు వేసుకుని, క్రమంగా రేకుల ఇళ్లు, పక్కా ఇళ్లు నిర్మించుకున్నారు. సుమారు 17 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ భూమి విలువ కొన్ని కోట్ల రూపాయలు ఉంటుందని సమాచారం. గతంలోనే అధికారులు ఇక్కడ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినప్పటికీ, ఇళ్ల నిర్మాణాలు ఆగకపోవడంతో కోర్టు ఆదేశాల మేరకు ఈ తొలగింపు చర్యలు చేపట్టినట్లు రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి.

...మిగతాది 2 లో

# బీఆర్ఎస్ క్యాడర్ లో జోష్

- **వరుస పర్యటనలలో కేటీఆర్**



జయభేరి, హైదరాబాద్ :
ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో సత్తాచాటేందుకు బీఆర్ఎస్ పార్టీ సర్వశక్తులు ఒడ్డింది. కానీ గెలుపు ముగింట బోల్తాపడింది. కేవలం 17 మున్సిపాలిటీలకు మాత్రమే పరిమితం అయింది. 7 కార్పొరేషన్లకు ఎన్నికలు జరగ్గా ఒక్క కార్పొరేషన్ ను గులాబీ పార్టీ దక్కించుకోలేదు. దీంతో క్షేత్ర స్థాయిలో ఏం జరిగింది అనే దానిపై గులాబీ అధిష్టానం ఆరా తీస్తోంది. దీంతో ఫలితాల నుంచి తేరుకుని క్యాడర్ లో ఉత్సాహం నింపేందుకు గులాబీ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ వరుస పర్యటనలు చేస్తున్నారు. మున్సిపాలిటీలకు ఎన్నికల కంటే ముందే ఇంఛార్జిలను నియమించినప్పటికీ మాజీ, తాజా ఎమ్మెల్యేలే టిక్కెట్ల విషయంలో కీలకపాత్ర పోషించారు. దీంతో మాజీ ఎమ్మెల్యేలపై వ్యతిరేకతతోనే పార్టీ ఓడిపోయిందని చర్చజరుగుతుంది. ఏడు 7 కార్పొరేషన్లకు ఎన్నికలు జరిగాయి. కానీ ఏ ఒక్క కార్పొరేషన్ లోనూ విజయం సాధించలేకపోయింది. రామగుండం, నిజామాబాద్, మహబూబ్ నగర్, మంచిర్యాల, కరీంనగర్, నల్లగొండ, కొత్తగూడెం కార్పొరేషన్లకు ఎన్నికలు జరిగాయి.

...మిగతాది 2 లో




# రాష్ట్రానికి కొత్త సిఎస్, డిజిపిలు ఎవరు?

జయభేరి, హైదరాబాద్, ఫిబ్రవరి 26 :
రాష్ట్రంలో కొత్త సిఎస్, డిజిపిలు ఎవరన్నది ప్రస్తుతం సస్పెన్స్‌గా మారింది. ప్రస్తుతం సిఎస్‌గా ఉన్న రామకృష్ణారావు పదవీకాలం వచ్చేనెల 31వ తేదీతో పూర్తి కానుండగా, ఇన్‌చార్జి డిజిపి శివధర్‌రెడ్డిది ఏప్రిల్ నెలతో పదవీకాలం ముగియనుంది. ఈ నేపథ్యంలోనే తమకే ఎక్స్‌టెన్షన్ ఇవ్వాలని ప్రస్తుత సిఎ స్, డిజిపిలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్టుగా తెలిసింది. అయితే, వారికి ఎక్స్‌టెన్షన్ ఇవ్వకుండా తమకు ఈ పదవులు కేటాయించాలని సీనియర్ ఐఎఎస్, ఐపిఎస్‌లు ప్రభుత్వానికి విన్నవించినట్టుగా సమాచారం. ఈ నేపథ్యంలోనే ఈ పదవుల కోసం పోటీపడుతున్న ఆశావహులు ఈ పదవులను దక్కించుకునేలా

# గంగా.. కావేరి నదుల అనుసంధానం కావాలి

- **నదుల అనుసంధానం చేస్తే నీటి సమస్య తగ్గుతుంది ఎపి సిఎం చంద్రబాబు నాయుడు**



జయభేరి, అమరావతి, ఫిబ్రవరి 26 :
నదుల అనుసంధానం చేస్తే నీటి సమస్య తగ్గుతుందనిఎపి సిఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. గంగాకావేరి నదుల అనుసంధానం కావాలని అన్నారు. ఎపి అసెంబ్లీలో రాయలసీమ ప్రాజెక్టుపై చర్చ జరిగింది. ఈ విషయంపై సిఎం ప్రసంగించారు. నదుల అనుసంధానం చేసి తల్లికి జలహారతి ఇచ్చే బాధ్యత తనదేనని, 2014 19 మధ్య రూ. 63 వేల కోట్లు ఖర్చు చేశామని తెలియజేశారు. రాయలసీమ ప్రాజెక్టుకు దశ,దిశ చూపించిన వ్యక్తి దివంగత ముఖ్యమంత్రి ఎన్టిఆర్ అని..ఎపిలో కట్టిన ప్రతి ప్రాజెక్టు కూడా టిడిపి కట్టిందేనని కొనియాడారు.

...మిగతాది 2 లో

# ఖర్గేను కలిసి వినతి పత్రం

- **తెలంగాణలో రాజ్యసభ ఖాళీ అయిన స్థానాలు వి హనుమంతరావు, జెట్టి కుసుమ కుమార్ ఇవ్వాలి**
- **మల్లికార్జున్ ఖర్గేను కోరిన తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి**



జయభేరి, న్యూ డిల్లీ, ఫిబ్రవరి 26 :
తెలంగాణలో రాజ్యసభ ఖాళీ అయిన స్థానాలు వి హనుమంతరావు, జెట్టి కుసుమ కుమార్ ఇవ్వాలని తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కోరారు.

...మిగతాది 2 లో

# ఎప్పుడు ఎవరి ఇల్లు కూలగొడతారు

- **ఎవరి భూములు గుంజుకుంటారు**
- **రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రజలకు ప్రశాంతత లేదు**
- **ఎప్పుడు అనగారిన వర్గాల మీద దాడులు జరుగుతాయో అని బిక్కుబిక్కుమంటూ బ్రతికే పరిస్థితి వచ్చింది**
- **మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్**



జయభేరి, న్యూ డిల్లీ, ఫిబ్రవరి 26 :
రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రజలకు ప్రశాంతత లేదని, ఎప్పుడు ఎవరి ఇల్లు కూలగొడతారు..ఎవరి భూములు గుంజుకుంటారు..ఎప్పుడు అనగారిన వర్గాల మీద దాడులు

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## గరం.. నరం.. బేషరం

అంశాలపై అభ్యర్థులు ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనను ముఖ్యమంత్రి పరిశీలించి పలు సూచనలు చేశారు. విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న అధికారులందరికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ, "విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా పనిచేయండి. విధులు, బాధ్యతలు నిర్వర్తించేప్పుడు ఎస్. ఆర్. శంకరన్ ని గుర్తుపెట్టుకోండి. పేదవారికి సహాయం చేసేప్పుడు తల్లిదండ్రులను గుర్తుపెట్టుకోండి. మంచి పని చేయడానికి విచక్షణ, అధికారం ఉంటే సరిపోతుంది. ప్రభుత్వంలో ప్రొసీజర్స్, ప్రాక్టీసెస్ ఉంటాయి. అర్థం కానప్పుడు కామన్ సెన్స్ పెద్ద అసెట్. చట్టాలు, నియమాలు, ఆదేశాలు పని చేయకుండా ఆపడానికి కాదు. పది మందికి సహాయం చేయడానికి, పదిమందికి ఏ విధంగా సహాయ పడగలమో ఆ రకంగా ముందుకు వెళ్లాలి. మొన్న విద్యార్థులు, నిన్న నిరుద్యోగులు, ఈనాడు తెలంగాణ ప్రభుత్వంలో అధికారులు. ప్రభుత్వ ప్రతినిధులుగా ప్రజా పాలనను 4 కోట్ల ప్రజలకు అందించడానికి ఈ శిక్షణ, అనుభవం పూర్తిగా వినియోగించడానికి సంసిద్ధులయ్యారని నేను విశ్వసిస్తున్నా.
తెలంగాణ ప్రాంత ప్రజలు ఆకలినైనా సహిస్తారు కానీ, ఆదిపత్యాన్ని స్వీకరించరు. కొన్ని దశాబ్దాలు రాచరికం నుంచి ప్రజాస్వామ్యం వరకు సామాజిక న్యాయం, సమాన అవకాశాల కోసం ఈ ప్రాంత ప్రజలు కొట్లాడారు. ఎంతో మంది ప్రాణత్యాగం చేశారు. దశాబ్దాలపాటు వారి త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని జీవిత ఆశయంగా, ఒక లక్ష్యంగా ముందుకు వెళ్లాలని లక్షలాది మందితో పోటీ పడి ఈ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. 2011 లో నిర్వహించిన గ్రూపు 1, ఆ తర్వాత 2025 వరకు నిర్వహించలేని పరిస్థితుల్లో ప్రజాప్రభుత్వం మీ ఆకాంక్షలకు అనుకూలంగా పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను సమూలంగా ప్రక్షాళన చేసి, గ్రూప్ 1 నిర్వహించాం. ఎన్నో కఠిన పరీక్షలు నిర్వహించినా ఈ ఉద్యోగాలను కొనుక్కున్నారని కొందరు ప్రచారం చేయడమే కాకుండా న్యాయస్థానాలను ఆశ్రయించారు. మీ తల్లిదండ్రులు కన్న కలలు నిజమవుతున్న సమయానికి 24 గంటలు తిరక్కముందే కుట్రలు పన్నారు. ఎంతో కష్టపడి మెరిట్‌లో ఎంపికయ్యారు. మీ శ్రమను గుర్తించి న్యాయస్థానాల్లో కొట్లాడి మీ కన్న కలలను సాకారం చేయడానికి ప్రభుత్వం మీ పక్షాన నిలబడింది. ఒక అధికారిగా గుర్తింపు పొందాలంటే 3035 సంవత్సరాల పాటు నిబద్ధతతో పనిచేయాల్సి ఉంది. ఉద్యోగంలో మీరు చూపే చొరవనే ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేస్తాయి. ఈ ప్రభుత్వానికి మీరే కళ్లు, చెవులు, మీరే మా ప్రతినిధులు. ప్రభుత్వం పాలసీ చేయొచ్చు. ఎంత గొప్ప నిర్ణయాలు చేసినా అధికారులు ప్రదర్శించే చిత్తశుద్ధి ప్రభుత్వానికి మంచి పేరు తెస్తుంది. హెచ్‌ఆర్డీలో శిక్షణ పూర్తి చేసుకున్న వారంతా ప్రభుత్వ ప్రతిష్ఠను నిలబెట్టడానికి ప్రయత్నిస్తారని భావిస్తున్నా. తెలంగాణ ప్రభుత్వంలో చేయబోయే ఈ ఉద్యోగం 4 కోట్ల మంది ప్రజలతో అనుబంధం. మీ జీవిత కాలం గుర్తు పెట్టుకునే, మరిచిపోలేని భావోద్వేగం. జీవితంలో సెటిల్ కావాలని రకరకాల ఆలోచనలతో కొన్ని తప్పిదాలు చేస్తుంటారు. గరం, నరం, బేషరం.. అన్న నానుడిని తప్పు అని రుజువుచేస్తూ పదవీ విరమణ చేసే సమయానికి కూడా గరంగానే ఉండాలని నా ఉద్దేశం. నిబద్ధతతో పనిచేయండి. మిమ్మల్ని ఈ స్థాయిలో నిలబెట్టడానికి మీ తల్లిదండ్రులు రెక్కలు ముక్కలు చేసుకుని రూపాయి రూపాయి జమ చేసి చదివించారు. వారిని బాగా చూసుకోండి. తల్లిదండ్రులను బాగా చూసుకోని వారికి గతంలో చెప్పినట్టే ఉద్యోగుల జీతాల్లోంచి కొంత కోత పెట్టి తల్లిదండ్రుల ఖాతాల్లో జమ చేస్తాం. ఇందుకు సంబంధించి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో చట్టం చేయబోతున్నాం" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు.

## ఖమ్మంలో కూల్చివేత

ఈ ఘటనపై విపక్షాలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతున్నాయి. బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా వంటి పార్టీల నేతలు బాధితులకు మద్దతుగా నిలుస్తూ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నారు. పేదల ఇళ్లను కూల్చడం అమానుషమని, వారికి ప్రత్యామ్నాయం చూపకుండా ఇలా చేయడం రాజ్యాంగ విరుద్ధమని విపక్ష నేతలు ఆరోపిస్తున్నారు. గతంలో తాము పేదలకు అండగా ఉన్నామని, ఇప్పుడు అధికార పార్టీ నాయకులు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని, వారికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేపట్టారు. అధికార కాంగ్రెస్ నేతలు ఈ విషయంలో ఆచితూచి స్పందిస్తున్నారు. ఇవి భూదాన్ భూములు కావడం వల్ల చట్టపరమైన చిక్కులు ఉన్నాయని, ప్రభుత్వ భూములను ఆక్రమించడం సరైనది కాదని కొందరు నేతలు వివరిస్తున్నారు. అయితే, నిజమైన పేదలకు అన్యాయం జరగకుండా చూస్తామని, అర్హులైన వారికి ప్రభుత్వం తరపున ఇళ్ల పట్టాలు లేదా ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటామని స్థానిక కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. గత ప్రభుత్వ హయాంలోనే ఈ ఆక్రమణలు మొదలయ్యాయని, సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని వారు పేర్కొంటున్నారు.
ఖమ్మంలో ఉద్రిక్త పరిస్థితులు
ఖమ్మంలో ఇళ్ల కూల్చివేత వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బాధితులు తమ సామాన్లతో శిథిలాల మధ్యే వర్షంలో కాలం గడుపుతున్నారు. పిల్లల చదువుల కారణంగా తమను కరుణించాలని, తమకు గూడు కల్పించాలని వేడుకుంటున్నారు. ప్రభుత్వం స్పందించి మానవతా దృక్పథంతో నిర్ణయం తీసుకోవాలని, రాజకీయాల కంటే పేదల బతుకులకు ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తులు వ్యక్తమవుతున్నాయి.

## బీఆర్ఎస్ క్యాడర్ లో జోష్

ఇందులో ఒక మహబూబ్ నగర్ కార్పొరేషన్ లోనే 15 డివిజన్లలో విజయం సాధించింది. కొత్తగూడెంలో 60 డివిజన్లలో 8 స్థానాల్లో, కరీంనగర్ లో 66 డివిజన్లు ఉంటే 9 డివిజన్లలో బిఆర్ఎస్ గెలిచింది. రాష్ట్రంలోని 4 మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ పార్టీ ఖాతా తెరవలేదు. కోస్గి, మక్తల్, ధర్మపురి, భైంసా మున్సిపాలిటీల్లో ఒక స్థానంలోను విజయం సాధించలేదు. ధర్మపురిలో 15 వార్డులు, కోస్గిలో 16 వార్డులు ఉండగా అన్నింటిలోనూ కాంగ్రెస్ క్లీన్ స్వీప్ చేసింది. 13 మున్సిపాలిటీల్లో గులాబీ పార్టీ సింగిల్ డిజిట్ కు పరిమితం అయింది. ఇక ఎల్లారెడ్డి, యాదగిరిగుట్ట, వడ్డేపల్లితో పాటు సుల్తానాబాద్, పెద్దపల్లి, నందికొండ, మంథని, మధిర, కొడంగల్, హాలియా, చొప్పదండి, భూత్పూర్, ఆత్మకూర్ మున్సిపాలిటీల్లో ఒక్కోవార్డులోనే బీఆర్ఎస్ విజయం సాధించింది. పార్టీ బలంగా ఉందని అంటున్న అర్బన్ ప్రాంతాల్లోను గులాబీ పార్టీ ఓడిపోవడంతో నేతలు, క్యాడర్ మధ్య సమన్వయ లోపం మరోసారి బయటపడింది. మున్సిపల్ ఎన్నికల ఫలితాల తర్వాత బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పీడ్ పెంచారు. వరుసగా జిల్లాల పర్యటనకు వెళ్తున్నారు. ఆదిలాబాద్, నాగర్ కర్నూల్, ఖమ్మం జిల్లాల్లో పర్యటించారు. ఆదిలాబాద్ జిల్లా జైలు లో ఉన్న మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ను పరామర్శించారు. ఆ తర్వాత కుమ్మెర మల్లన్న ఘటనలో బాధిత కుటుంబాన్ని నాగర్ కర్నూల్ వెళ్లి ఓదార్చారు. ఖమ్మం నగరంలో వెలుగుమట్ల భూదాన్ భూముల్లో గుడిసెలు వేసుకున్న వారి ఇళ్లను కూల్చివేయడంతో నిరాశ్రయులను ఇతర బిఆర్ఎస్ నేతలతో కలిసి గులాబీ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజల్లో ఉండాలని కేటీఆర్ భావిస్తున్నట్లుగా తెలుస్తోంది. మున్సిపల్ ఎన్నికల ఫలితాల ప్రభావం క్యాడర్ పై పడకుండా కేటీఆర్ వరుస పర్యటనలు క్యాడర్ లో ఎలాంటి జోష్ నింపుతుందో చూడాలి.

## నదుల అనుసంధానం కావాలి

ప్రాజెక్టుల విషయంలో ప్రతిపక్షం క్రెడిట్ చోరీ చేస్తోందని, గతంలో నీళ్లు రాకుండా రిబ్బన్ కట్ చేశారని విమర్శించారు. తమ కుప్పంకు కూడా నీళ్లు ఇస్తున్నామన్నారని, పోలవరం లాంటి పెద్ద ప్రాజెక్టు దేశంలో మరెక్కడా ఉండదని తెలియజేశారు. పుష్కరాల కంటే ముందే పోలవరాన్ని పూర్తి చేస్తామని సిఎం పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర లో అనేక ప్రాజెక్టులు పెండింగ్ లో ఉన్నాయని, నాగావళి, చంపావతి, జంఝావతి ప్రాజెక్టు, చింతలపూడి ప్రాజెక్టును రెండేళ్లల్లో పూర్తి చేస్తామని అన్నారు. రాష్ట్రంలో అన్ని రిజర్వాయర్లు నీటితో కళకళలాడుతున్నాయని, రాబోయే రోజుల్లో వర్షపాతం తగ్గొచ్చునని, మే 12న నారుమళ్లకు నీరు అందిస్తామని చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

# ఓటింగ్ కు ఏఐ మిక్సింగ్

భారత ఎన్నికల ప్రక్రియను బలోపేతం చేయడంపై కేంద్ర ఎన్నికల సంఘం దృష్టి సారించింది. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనది. అయితే వలసలు, అనారోగ్యం లేదా ఇతర అనివార్య కారణాల వల్ల లక్షలాది మంది తమ ఓటు హక్కును వినియోగించుకోలేకపోతున్నారు. ఈ సమస్యకు పరిష్కారంగా బిహార్ రాష్ట్ర ఎన్నికల సంఘం 'కృత్రిమ మేధ' 'బ్లాక్‌చెయిన్' సాంకేతికతలతో కూడిన ఇఓటింగ్ విధానాన్ని తెరపైకి తెచ్చింది. 2026లో జరిగిన 'ఏఐ ఇంపాక్ట్ సమిట్'లో ఈ విధానాన్ని ప్రదర్శించి దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించింది. ఇందుకోసం ఢిల్లీ భారత మండపంలో కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ల జాతీయ రౌండ్ టేబుల్ సమావేశం జరగనుంది. ఇది 27 ఏళ్ల తర్వాత కేంద్ర, రాష్ట్ర ఎన్నికల అధికారులు మధ్య జరుగుతున్న రౌండ్ టేబుల్ సమావేశం. ఈవీఎంలు, ఓటర్ల జాబితాలు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, ఎన్నికల ప్రక్రియలను బలోపేతం చేయడంపై అంశాలపై అధికారులు చర్చలు జరపనున్నారు. చివరిసారిగా ఇలాంటి సమావేశం 1999లో జరిగింది. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ అధ్యక్షత వహిస్తారు. ఎన్నికల కమిషనర్లు డాక్టర్ సుఖ్‌బీర్ సింగ్ సంధు డాక్టర్ వివేక్ జోషి సమక్షంలో ఈ సమావేశం జరుగుతుంది. అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల రాష్ట్ర ఎన్నికల కమిషనర్లు, చట్టపరమైన, సాంకేతిక నిపుణులు పాల్గొంటారు. మొత్తం 36 రాష్ట్రాలు కేంద్రపాలిత ప్రాంతాల నుంచి రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రధాన ఎన్నికల అధికారులు పాల్గొనున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ఎన్నికల కమిషన్ ల పనితీరు, ఎన్నికల ప్రక్రియలు, లాజిస్టిక్స్‌ను పెంపొందించడం, నిర్మాణాత్మక ఆలోచనల మార్పిడికి ఎన్నికల నిర్వహణలో సహకార సమాఖ్య స్ఫూర్తిని బలోపేతం చేయడం అంశాలపై చర్చలు జరగనున్నాయి. ఎన్నికల ప్రక్రియలను బలోపేతం చేయడంతో పాటు, సాంకేతికత, ఈవీఎంలు, ఓటర్ల జాబితా అంశాలపై చర్చలు జరగనున్నాయి. ఇటీవల ప్రారంభించినడిజిటల్ ప్లాట్‌ఫామ్, ఎన్నికల సేవలను క్రమబద్ధీకరించడంలో మార్పులు, సాంకేతికత వినియోగ కార్యాచరణ కార్యక్రమాలపై ఎన్నికల కమిషన్ సీనియర్ అధికారులు ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పటిష్టత, పారదర్శకత, భద్రత అంశాలపై రాష్ట్రాల ఎన్నికల అధికారులకు ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు సీనియర్ ఎన్నికల అధికారులు.. అన్ని ప్రాంతాలలో ఓటర్ల జాబితా తయారీని నియంత్రించే చట్టపరమైన మార్గదర్శకాలను సులభతరం చేయడానికి,




ప్రజాప్రాతినిధ్య చట్టం, 1950కి సంబంధించి రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల వారీగా ఓటర్ల అర్హతపై చర్చలు జరగనున్నాయి. ఆర్టికల్స్ 243K, 243ZA ప్రకారం పంచాయతీలు, మున్సిపల్ సంస్థలకు ఎన్నికల జాబితా తయారీ, నిర్వహణ పర్యవేక్షణ, దిశానిర్దేశం నియంత్రణను రాష్ట్ర ఎన్నికల కమిషన్లు కలిగి ఉన్నాయి. దేశవ్యాప్తంగా సర్ ప్రక్రియ సహా త్వరలో జమిలి ఎన్నికల పై చర్చ జరుగుతున్న నేపథ్యం కేంద్ర రాష్ట్ర ఎన్నికల అధికారుల సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. ద్యోగాల కోసం ఇతర నగరాలకు వెళ్లే కార్మికులు, దూర ప్రాంతాల్లో చదువుకునే విద్యార్థులు, అలాగే శారీరక ఇబ్బందులు ఎదుర్కొనే వృద్ధులు, వికలాంగులకు ఈ విధానం ఒక వరంలా మారనుంది. పోలింగ్ కేంద్రానికి వెళ్లాల్సిన అవసరం లేకుండానే, తమ వద్ద ఉన్న స్మార్ట్‌ఫోన్ ద్వారానే సురక్షితంగా ఓటు వేసే వెసులుబాటును ఈ ఇఓటింగ్ యాప్ కల్పిస్తుంది. పట్టణ ప్రాంతాల్లో తగ్గుతున్న ఓటింగ్ శాతాన్ని పెంచడమే లక్ష్యంగా బిహార్ ప్రభుత్వం ఇప్పటికే మున్సిపల్ ఉప ఎన్నికల్లో దీనిని విజయవంతంగా పరీక్షించింది. ఈ ఓటింగ్ సాంకేతికతతో పకడ్బందీ భద్రత డిజిటల్ ఓటింగ్ అనగానే భద్రతపై అనేక అంచనాలు ఉంటాయి. అందుకే బిహార్ ఎన్నికల సంఘం అత్యున్నత స్థాయి రక్షణ చర్యలను చేపట్టింది: ఫేషియల్ రికగ్నిషన్: ఓటరు గుర్తింపు కార్డు డేటాబేస్ ఆధారంగా ముఖ గుర్తింపు ప్రక్రియ ద్వారా అసలైన ఓటరును గుర్తిస్తారు. బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ: వేసిన ప్రతి ఓటు ఎన్‌క్రిప్ట్ చేయబడి బ్లాక్‌చెయిన్‌లో రికార్డ్ అవుతుంది. దీనివల్ల డేటాను ఎవరూ ట్యాంపర్ చేయడం లేదా మార్చడం అసాధ్యం. డిజిటల్ ఈవీఎం: స్మార్ట్ కాంట్రాక్ట్ వ్యవస్థ ద్వారా డిజిటల్ పద్ధతిలో ఓట్ల లెక్కింపు జరుగుతుంది. రిటర్నింగ్ అధికారి డిజిటల్ సిగ్నేచర్ ఉంటేనే డేటా డీక్రిప్ట్ అవుతుంది. ఓటు వేయడం ఇప్పుడు సులభం ఓటర్లు ముందుగా అధికారిక యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, ఓటీపీ ద్వారా మొబైల్‌ను ధ్రువీకరించుకోవాలి. ఆపై ఎపిక్ కార్డు వివరాలు నమోదు చేసి, లైవ్ ఫేషియల్ రికగ్నిషన్ ద్వారా తమను తాము ధ్రువీకరించుకున్న తర్వాత నేరుగా ఓటు వేయవచ్చు. ఈ ప్రక్రియ అంతా అత్యంత రహస్యంగా, పారదర్శకంగా సాగేలా జాగ్రత్తలు తీసుకున్నారు. ఏదైనా కొత్త వ్యవస్థ అమల్లోకి వచ్చినప్పుడు కొన్ని ఇబ్బందులు సహజం. పాత ఫోటోలు స్పష్టంగా లేకపోవడం, ఇంటర్నెట్ అంతరాయాలు, డిజిటల్ అక్షరాస్యత లేకపోవడం వంటి సవాళ్లు ఉన్నప్పటికీ.. బిహార్ ఎన్నికల సంఘం నమూనా ఓటింగ్ ద్వారా ప్రజల్లో, రాజకీయ పార్టీల్లో నమ్మకాన్ని కలిగించగలిగింది. ఫలితాల లెక్కింపు కోసం కూడా ఏఐ ఆధారిత ఓసీఆర్ వ్యవస్థను వాడుతుండటం వల్ల మానవ తప్పిదాలకు తావు లేకుండా వేగంగా ఫలితాలు వెలువడనున్నాయి.. మరో వైపు ఏపీ, తెలంగాణ సహా 22 రాష్ట్రాల్లో ఓటర్ జాబితాలను సవరించబోతోంది. దీన్నే సర్ అని పిలుస్తున్నారు. అంటే.. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అని అర్థం. ఈ సర్ ద్వారా.. కేంద్ర ఎన్నికల సంఘం.. ఓటర్ల జాబితాల్ని పూర్తిగా పరిశీలించి, తప్పులను సరిచేస్తుంది. అంటే ప్రక్షాళన చేస్తుందన్నమాట. ఇది ఏప్రిల్ నుంచి మొదలయ్యే ఛాన్స్ ఉంది.

ఈ సర్ ప్రక్రియను ఈసీ.. ఇప్పటికే బీహార్‌లో పూర్తి చేసింది. మరో 9 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాల్లో పూర్తి చేస్తూ ఉంది. మిగతా 22 రాష్ట్రాలూ, కేంద్ర పాలిత ప్రాంతాల సంగతి చూడబోతోంది. ఇది పూర్తైతే.. ఓటర్ల జాబితాలో అక్రమాలు దాదాపు తొలగినట్లే అవుతుంది. అప్పుడు ప్రజల నుంచి పెద్దగా అభ్యంతరాలు రాకపోవచ్చు. 2027లో కేంద్రం జనాభా లెక్కల గణన ప్రారంభించాలి అనుకుంటోంది. అప్పటికల్లా... ఓటర్ల జాబితాలను పర్ఫెక్ట్ చెయ్యాలి అని ECI ప్లాన్ చేస్తోంది. ఈ సర్ ప్రక్రియ మొదలయ్యాక.. ఎన్నికల అధికారులు, సిబ్బందీ.. ప్రతీ ఇంటికీ వస్తారు. ఇంట్లో అందరి ఓటర్ జాబితాల్నీ చెక్ చేస్తారు. పూర్తి వివరాల్ని క్రాస్ చెక్ చేస్తారు. ఏవైనా తప్పులు ఉంటే, వెంటనే సరిచేస్తారు. ఓటర్ల జాబితాలో పేరు ఉండి, ఆ వ్యక్తి లేకపోతే, ఆ పేరును జాబితా నుంచి తొలగిస్తారు. కాబట్టి.. వాళ్లు వచ్చే లోపే.. ఏవైనా సమస్యలు ఉంటే.. మనమే ముందుగా సరిచేసుకోవడం మేలు. ఈ సర్ ప్రక్రియ ద్వారా.. కొన్ని లక్షల ఓటర్ల పేర్లను ఈసీ తొలగిస్తోంది. బెంగాల్‌లో 58లక్షల మందికి పైగా ఓటర్ల పేర్లను తొలగించింది సీఈసీ. ఇది నచ్చని సీఎం మమతా బెనర్జీ.. రచ్చ రచ్చ చేశారు. అసలు సర్ ప్రక్రియనే రద్దు చెయ్యాలన్నారు. కానీ.. సుప్రీంకోర్టు.. సర్ కొనసాగించాలనీ.. దానికి ఎలాంటి అడ్డంకులూ సృష్టించకూడదని బెంగాల్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇలాంటి అభ్యంతరాలు మన తెలుగు రాష్ట్రాల్లో రాకపోవచ్చు. కాకపోతే, ఎన్ని పేర్లను ఏపీ, తెలంగాణలో తొలగిస్తుందో అనే చర్చ మొదలైంది. చూద్దాం ఏం జరుగుతుందో.

## ఖర్గేను కలిసి వినతి పత్రం

ఈ మేరకు ఢిల్లీలో ఏఐసిసి ప్రెసిడెంట్ మల్లికార్జున్ ఖర్గేను కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం జగ్గ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో రాజ్యసభ ఖాళీ అయిన స్థానాలు సీఎం రేవంత్ రెడ్డి, పిసిసి ప్రెసిడెంట్, నటరాజ్ ఇన్చార్జ్ తో కూడా మాట్లాడాను వి హనుమంతరావుకి. జెట్టి కుసుమ కుమార్ కి రాజ్యసభ ఇవ్వాలని కోరానన్నారు. రాహుల్ గాంధీనీ, మల్లికార్జున్ ఖర్గేనీ కలవడానికి ఢిల్లీ వచ్చానని రాహుల్ గాంధీ ముందస్తు షెడ్యూల్ కారణంగా ఆయన బిజీగా ఉన్నారు. మల్లికార్జున కలిసి వి హనుమంతరావుకి. జెట్టి కుసుమ కుమార్ కి రాజ్యసభ ఇవ్వాలని కోరాను. వారికి రాజ్యసభ అవకాశాలపై ఆలోచన చేయాలని కోరినట్లు తెలిపారు. జెట్టి కుసుమ కుమార్ యూత్ కాంగ్రెస్ లీడర్, స్టూడెంట్ లీడర్ కమ్మ సామాజిక నుంచి ఉన్నాడు.. కమ్మ నాయకుడుగా అవకాశం ఇవ్వాలని కోరానుజెట్టి కుమార్ ఫ్యామిలీ ఫ్రీడమ్ ఫైటర్స్, వల్ల కుటుంబం నుంచి అందరు కాంగ్రెస్ లోనే ఉన్నారుహనుమంతరావు తెలంగాణలో అనేక ముఖ్యమంత్రులతో పని చేశారు, మూడు సార్లు రాజ్యసభ ఎంపీగా పని చేశారు. రాజీవ్ గాంధీ, సోనియాగాంధీ ఆయనకు అవకాశాలు ఇచ్చారు. వయసులో పెద్ద వ్యక్తి చురుకైన వ్యక్తి కాబట్టి మరో సారి అవకాశం ఇవ్వాలని కోరానన్నారు. అందుకు ఖర్గే కమిటీలో చర్చిస్తామని హామీ ఇచ్చారు. రాహుల్ గాంధీ నిర్ణయం మేరకు ముందుకు వెళ్తామని తెలిపినట్లు జగ్గ రెడ్డి తిలిపారు.

## రాష్ట్రానికి కొత్త సిఎస్, డిజిపిలు ఎవరు?

తమవంతు ప్రయత్నా లు చేస్తున్నట్టుగా సెక్రటేరియట్ వర్గాలు చర్చించుకుంటున్నాయి. 2025 ఏప్రిల్ 30వ తేదీన రామకృష్ణారావు సిఎస్‌గా బాధ్యతలు చేపట్టారు. 2025 ఆగష్టు 31తో పదవీ విరమణ చేయాల్సి ఉండగా, ఆయన సర్వీస్‌ను ప్రభుత్వం 7 నెలలు పొడిగించింది. ఈ నేపథ్యంలోనే ప్రస్తుత సిఎస్ రామకృష్ణారావు పదవీ కాలం మార్చి 31వ తేదీ తో ముగియనుంది. ఇప్పటికే రామకృష్ణారావుకు ఒకసారి ఏడునెలలు సర్వీస్ పొడిగింపును ప్రభుత్వం ఇచ్చిన నేపథ్యంలో మరోసారి ఆయన పదవీకాలాన్ని పెంచే అవకాశాలు లేవని సీనియర్ ఐఏఎస్‌లు పేర్కొంటుండడంతో సిఎస్ ఎవరన్న చర్చ ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారింది. అయితే, మరికొందరు ఐఏఎస్‌లు మాత్రం ప్రస్తుత సిఎస్ రామకృష్ణారావు పదవీ కాలాన్ని పొడిగించే అవకాశం ఉందని పేర్కొంటుండడం విశేషం. ఈ నేపథ్యంలోనే రామకృష్ణారా వు పదవీ కాలాన్ని పొడిగిస్తారా లేక కొత్తవారిని ఎంపిక చేస్తారా? అ న్న విషయం త్వరలో తేలనుంది. అయితే, సిఎస్ రామకృష్ణారావు పదవీ పొడిగింపుపై కేంద్రం నుంచి సానుకూలత రాకుంటే ఆ పదవిని దక్కించుకునేందుకు సీనియర్ ఐఏఎస్‌లు పెద్ద ఎత్తున లాబీయింగ్ చేస్తున్నట్లుగా తెలిసింది. మరోవైపు సిఎస్ పదవిని దక్కించుకునేందుకు సీనియర్ ఐఏఎస్ అధికారులు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. కొందరైతే రామకృష్ణారావు పదవీ కాలాన్ని పొడిగించవద్దని కొందరు సీనియర్ ఐఏఎస్‌లు ఫిర్యాదులు చేసినట్లుగా తెలిసింది.

## ఎప్పుడు ఎవరి ఇల్లు కూలగొడతారు

జరుగుతాయో అని బిక్కుబిక్కుమంట్ బ్రతికే పరిస్థితి వచ్చింది. మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆందోళన వ్యక్తం చేసారు. ఢిల్లీ లోని తెలంగాణా భవన్ లో మీడియా సమావేశం లో మాట్ల;ఆడుతూ .నాటి ఆంధ్రప్రదేశ్ నేటి తెలంగాణ వరకు 70 సంవత్సరాల కాలంలో రేవంత్ రెడ్డి లాంటి ముఖ్యమంత్రిలు ఉండి ఉంటే హైదరాబాదులో



కొన్ని వందల బస్తీలు మాయం అయ్యేవి. అందులో పేదలు ఉండే ఆస్కారం లేకుండా పోయేది. వాజ్పేయి నగర్, వెంకటస్వామి నగర్, అంజయ్య నగర్, బద్దం బాల్రెడ్డి నగర్, టైగర్ నరేంద్ర నగర్ లాంటి బస్తీలే ఉండకుండా పోయేవి. ఆనాడు హైదరాబాద్ కు శ్రీకాకుళం, విజయనగరం, కరీంనగర్, ఆదిలాబాద్ నుంచి పొట్ట చేత పట్టుకుని జీవనం కోసం వచ్చి అసైన్మెంట్ భూములలో, దేవాలయ భూములలో, ప్రభుత్వ భూములలో, భూధాన్ భూములలో గుడిసెలు వేసుకొని.. 60 గజాలు 80 గజాల్లో ఇల్లు కట్టుకొని 50 ఏళ్లుగా జీవనం కొనసాగిస్తున్నారు. అలాంటి స్థితి ఈరోజు లేకుండా పోయింది. ఖమ్మంలో భూధన్ భూములలో బ్రతకడానికి వచ్చిన పేదలు గుడిసెలు వేసుకొని రేకుల షెడ్డులు వేసుకొని జీవిస్తా ఉంటే అకారణంగా, చెప్పాకుండా, నోటీసులు ఇవ్వకుండా ఇంటికి ఒక డీసీఎం పంపించి.. యుద్ధభూమిని తలపించే పద్ధతిలో పదివేల మంది పోలీసులతో ప్రజల మీద చేసిన దాడి ఇల్లు కూలగొడుతున్న తీరు మహిళలు పెట్టిన కన్నీరు పద్ధతి పిల్లలు కూడా మా ఇల్లు కూలగొట్టకండి కార్చిన కన్నీళ్ల సాక్షిగా తెలంగాణ సమాజం సిగ్గుతో తలదించుకుంటుంది. ఈ ప్రభుత్వానికేనా, ఈ పార్టీకేనా, ఈ ముఖ్యమంత్రికేనా మేము మద్దతు ఇచ్చింది అనే పరిస్థితి వచ్చింది. పెద్దవాళ్లు కోట్లకు పరిగెత్తిన వాళ్ళు ప్రభుత్వ భూములను కోర్టులను మేనేజ్ చేసుకుని తీర్పులు తెచ్చుకొని వేల కోట్ల రూపాయల భూములు ఆక్రమించుకుంటుంటే వాటి మీద మాత్రం చర్యలు ఉండవు. నేను 2007 నుంచి కూకట్పల్లి పక్కన ఉన్న ఎల్లమ్మ బండలోని 94 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడాను. రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి ఉండగా అదే సర్వే నెంబర్లు 150 మందికి ఇళ్ల జాగాలు ఇస్తే ఇప్పుడు అదే సర్వే నంబర్ లో అదే ప్రభుత్వపరమైన భూమిని ప్రైవేటు వ్యక్తికి చెందింది అని తీర్పు తెచ్చుకుంటే... ఆనాటి ప్రభుత్వం మళ్ళీ సుప్రీంకోర్టుకి డబుల్ బెంచ్ కి పోకుండా మిన్నకుండా ఉంది. ఇప్పుడు ఈ ప్రభుత్వం ఏడు వేల కోట్ల రూపాయల విలువైన ఎల్లమ్మబండ 125 ఎకరాల భూమిని పెద్దవారు కబ్జా పెడితే చోద్యం చూస్తుంది. నోరులేని దిక్కులేని బిక్కు బిక్కు మంటూ బ్రతికే ప్రజలు 60 గజాలు 80 గజాలలో వేసుకున్న గుడిసెలు మాత్రం కూల్చివేసి.. పేదల కన్నీరులను చవిచూస్తున్న ప్రభుత్వం రేవంత్ రెడ్డి ప్రభుత్వం. మూసి ప్రక్షాళన పేరుతో వేలవేల ఇళ్ళను కూలగొట్టే ప్రయత్నం చేసిన నాడు ఇది తగదని కొట్లాడినంమూసి ప్రక్షాళన చేయండి కానీ దాని పేరిట వందల ఎకరాల్లో ఉన్న ఇళ్లను కాలనీలను కూలగొట్టి సుందరీకరణ పేరుతో పేదవారి కళ్ళలో మట్టి కొట్టి మల్టీప్లెక్సు్ల నిర్మిస్తా అంటే ఊరుకునేది లేదని మూడు నెలలు ఈ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొట్లాడినము. మూసి నదిలో కొబ్బరి నీళ్ల లాంటి నీళ్లను పారించండి, ప్రక్షాళన చేయండి మాకు బాధ లేదు. కానీ ప్రక్షాళన పేరుతో మధురిడ్జ్ అపార్ట్మెంట్ లాంటి వాటిని కూలగొట్టి 500 కుటుంబాల వారిని రోడ్డున పడేస్తే చూస్తూ ఊరుకోం. అక్కడ మహిళలు పెడుతున్న శాపనార్థాలు, ప్రజలు బాధపడుతున్న తీరు మీకు కనిపించడం లేదా ? అని అడుగుతున్నాను. కేంద్ర ప్రభుత్వం మిలిటరీ శాఖ భూమి మీకు ఇచ్చింది. అక్కడ గాంధీ పార్కు బ్రహ్మండంగా నిర్మించుకోండి. కానీ ఐదువందల ఇళ్లను కొల్లగొట్టి రోడ్డుమీద వేసి.. నష్టపరిహారం పేరిట భుఖాయించి వారికి కన్నీళ్లు చూసే ప్రయత్నం చేస్తే ఖబర్దార్ అని హెచ్చరిస్తున్నా. ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలయింది. ఆనాటి నుంచి ఈనాటి వరకు పేదలకు కుంట భూమి ఇవ్వలేదు. డబ్బులు బెడ్ రూమ్ ఇవ్వలేదు. ఇచ్చుడు దేవుడు ఎరుగు కానీ పేదల ఇళ్ల కూలగొట్టి పేదల జీవితాలతో చెలగాటమాడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం రికార్డ్ కి ఎక్కుతుంది. నేను డిమాండ్ చేస్తున్నాను..20 ఏళ్లుగా ఖమ్మంలో గుడిసెలు వేసుకొని ఉన్న వారికి ఇంటి జాగాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాను. మధురిడ్జ్ అపార్ట్మెంట్ వారి జోలికి పోకుండా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన జాగాలో 60 రకాలలో బ్రహ్మండమైన పార్క్ కట్టుకోండి. ఇంజనీరింగ్, ఫార్మసీ, ఎంసీఏ చదువుకునే పిల్లలకు ఐదు వేల కోట్ల ఫీజు రిబర్స్మెంట్ ఇవ్వడానికి డబ్బులు లేవు కానీ.. 5 వేల కోట్లు పెట్టి గాంధీ పార్కు నిర్మాణానికి డబ్బులు ఎక్కడివని నేను అడుగుతున్నా. లక్షల మంది తల్లిదండ్రుల వేదన మిగిల్చి, రిటైర్డ్ అయిన వారికి బెనిఫిట్స్ ఇవ్వకుండా వారి జీవితాలతో చెలగడం మాడుతున్నారు. దావఖానలో మందులు లేవు. ఉద్యోగులు దాచుకున్న డబ్బులు ఇవ్వరు. స్కాలర్షిప్లు లేవు, హాస్టల్ లో డైట్ చార్జీ లేవు, పైసలు లేవని చెప్తూనే.. అప్పుల పాలైనమని చెప్తూనే..ఉత్త చిప్ప చేతికి ఇచ్చారని చెప్తున్న మీరు మాత్రం గాంధీ పార్క్ కోసం ఇండ్లు కులగొట్టి 5 వేల కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నారంటే మీరు చూపు అంతా ఎటువైపు ఉందో దానిని బట్టి అర్థమవుతుంది. దీనికి తప్పకుండా మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరిస్తున్నాను. మహబూబ్నగర్ జిల్లా నాగర్ కర్నూల్ లో జరిగిన దాడి.. దళిత అమ్మాయి రజక అబ్బాయి పెళ్లి చేసుకునీ చిన్న పిల్లతో గుడికి పోతే.. అక్కడ ఉన్న పెత్తందారులు చేసిన దాడిలో చిన్న పాప చనిపోయింది. ఇలాంటి సంఘటనలు తెలంగాణ వ్యాప్తంగా ఏదో ఒకటి జరుగుతూనే ఉన్నాయి. ఎవరు నన్ను ఏం చేయలేరు అని చెప్పి అనుకుంటున్నారు. కానీ ఇలాంటి ప్రభుత్వానికి సందర్భం వచ్చినప్పుడు ఎలాంటి తీర్పు చెప్పాలో ప్రజలు చూస్తారని హెచ్చరిస్తున్నాను. లా అండ్ ఆర్డర్ సరిగా లేదు. పేదల ప్రజలకు రక్షణ లేకుండా పోయింది. పేదవారి గుడిసెలకు భరోసా లేకుండా పోయింది. రాహుల్ గాంధీ గారు మీరు మాట మాట్లాడితే పేదల గురించి, ధర్మం గురించి, చట్టం గురించి, న్యాయం గురించి మాట్లాడుతున్నారు.. కానీ మీ పార్టీ అధికారంలో ఉన్న తెలంగాణ రాష్ట్రంలో ఏం జరుగుతుందో చూడండి. దానిని నిలువరించే ప్రయత్నం చేయండి. రేవంత్ రెడ్డి సర్కారీ చేస్తున్న ఆగడాలు దుర్మార్గాలు ఆపే ప్రయత్నం చేయకపోతే మీ పార్టీని తెలంగాణ ప్రజల భూస్థాపితం చేస్తారని హెచ్చరిస్తున్నాను. కేంద్రం సహాయం చేస్తుంది అభివృద్ధి కోసం. ప్రాజెక్ట్ రిపోర్ట్ లో ఇల్లు కూలగొడుతున్నాం అపార్ట్మెంట్లు కులగోడుతున్నాం కాలనీలు కూలగొడుతున్నాం, పేదల భూములు గుంజుకుంటామని చెప్పలేదు. మంచి పని చేస్తున్నామంటే డబ్బులు ఇచ్చారు. మూసి ప్రక్షాళన చేయాలి. రసాయనాలతో మురికి కూపంగా ఉన్న మూసినీ ఇప్పుడున్న టెక్నాలజీతో బ్రహ్మండంగా తయారు చేయాలి. కొబ్బరి నీళ్ల లాంటి నీళ్లు పారించాలి. పిల్లలు ఈత కొట్టేలాగా తయారు చేయాలి. కానీ సుందరీ కరణ పేరుతో వందల ఎకరాలు సేకరించి వేలవేల కుటుంబాల కళ్లలో మట్టి కొట్టి మల్టీప్లెక్సు్ల పార్కులు నిర్మిస్తారని కేంద్రం వారు భావించరు. తెలంగాణలో జరుగుతుంది ఏంటో కేంద్రం దృష్టికి తీసుకుపోతాం. ప్రజాక్షేత్రంలో తేల్చుకుంటామన్నారు.

# జయహే నృసింహా..జయ జయహే నృసింహా..!


- కన్నుల పండువగా రథోత్సవం


**జయభేరి, యాదగిరిగుట్ట, ఫిబ్రవరి26 :**

తెలంగాణ ప్రజల ఇలవేల్పు శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దంపతులు రథంపై మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులపై కరుణాకటాక్షాలు కురిపించారు. వార్షిక బ్రహ్మోత్సవాలలో కీలక ఘట్టాల్లో ఒకటైన రథోత్సవం గురువారం రాత్రి యాదగిరి కొండపై అత్యంత వైభవంగా జరిగింది. రక రకాల పూలదండలతో అతి సుందరంగా.. శోభాయమానంగా రథాన్ని అలంకరించారు.

**"గోవిందా... గోవిందా ...**

శ్రీ లక్ష్మీ నరసింహ స్వామికి జై.. జై జై "" నామస్మరణలతో భక్తులు రథం తాళ్ళను ముందుకు లాగేందుకు భక్తితో పోటీలు పడ్డారు. మంగళ వాయిద్యాలు,





కోలాటాలు,కళాకారుల నృత్య ప్రదర్శనలు,భాజా భజంత్రీలు మ్రోగుతుండగా మెల్లమెల్లగా రథం ముందుకు సాగింది. వైకుంఠ వాసుడిని స్వయంగా చూసిన ఆధ్యాత్మిక అనుభూతిని భక్తులు పొందారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ నూతన డైరెక్టర్ హనుమంత రావు కుటుంబ సభ్యులు, ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహ మూర్తి, యాదగిరిగుట్ట ఆలయ ఈవో భవానీ శంకర్,డిఈవో బాస్కర్ శర్మ,ఆలయ అధికారులు,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

**నేడు చక్ర తీర్ధ స్నానం..**

బ్రహ్మోత్సవాలలో పదవరోజు శుక్రవారం ఉదయం 9:30 గంటలకు మహా పూర్ణాహుతి, చక్రతీర్ధం, విష్ణు పుష్కరిణిలో అవ అవబృత స్నానం.. రాత్రి 7 గంటలకు శ్రీ పుష్పయాగం. ద్వాదశ ఆరాధన, దేవతోద్వాసన,దోపు ఉత్సవము నిర్వహిస్తారు.

# అట్టడుగు ప్రజలకు అభివృద్ధి.. సంక్షేమ ఫలాలు

- యాదాద్రి-భువనగిరి జిల్లా నూతన కలెక్టర్ అనురాగ్ జయంతి

**జయభేరి, యాదాద్రి భువనగిరి :**

విద్య వైద్య రంగాలతో పాటు అభివృద్ధి సంక్షేమ





ఫలాలు అట్టడుగు ప్రజలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా సమగ్ర అభివృద్ధి దిశగా జిల్లా ముందుకు సాగుతుందని యాదాద్రి భువనగిరి జిల్లా నూతన కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. 2015 సంవత్సరం ఐఏఎస్ బ్యాచ్ కి చెందిన అనురాగ్ జయంతి యాదాద్రి భువనగిరి జిల్లా నూతన కలెక్టర్ గా గురువారం పదవి భాధ్యతలు స్వీకరించారు.

గతంలో అయన భోధన్, ఖమ్మం జిల్లాలలో సబ్ కలెక్టర్,రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గా,జిహెచ్ఎంసీ పరిధిలో ఖైరతాబాద్ జోనల్ కమీషనర్ గా పని చేశారు, ప్రస్తుతం రాజేంద్ర నగర్ జోనల్ కమిషనర్ విధులు నిర్వహిస్తున్న అనురాగ్ జయంతి బదిలీపై యాదాద్రి భువనగిరి జిల్లా నూతన కలెక్టర్ గా భాధ్యతలు చేపట్టడం జరిగింది. యాదగిరీశుడిని దర్శించుకున్న యాదాద్రి భువనగిరి జిల్లా నూతన కలెక్టర్ అనురాగ్ జయంతి యాదాద్రి భువనగిరి జిల్లా నూతన కలెక్టర్ అనురాగ్ జయంతి గురువారం యాదగిరిగుట్టలో శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అయనకు అర్చకులు వేద ఆశీర్వచనం చేశారు.యాదగిరిగుట్ట ఆలయ ఈవో భవాని శంకర్ నూతన కలెక్టర్ కు శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి చిత్ర పటాన్ని అందజేశారు.

# మేరా భారత్ నల్గొండ వారి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ మేరా భారత్ నల్గొండ వారి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్ జిల్లాస్థాయి స్పోర్ట్స్ మీట్ స్థానిక దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ భవనం నందు కబడ్డీ షటిల్ తగ్గాఫోర్ రన్నింగ్ క్రీడలను నిర్వహించుకోవడం జరిగినది. దీనికి ముఖ్య అతిథులుగా MLA నేనావత్ బాలు నాయక్, అధ్యక్షులు NVT, మున్సిపల్ చైర్మన్ పున్నా శైలజ వెంకటేష్, అల్లంపల్లి నరసింహ క్రీడాకారులతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించినారు.

అనంతరం వారు మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ఆడుకోవాలని క్రీడాకారుల స్టేడియాలకై కృషి చేస్తానని అతి త్వరలో స్టేడియాలు నిర్మాణం చేపడతానని అన్నారు. అనంతరం బహుమతి ప్రధానోత్సవానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన DSP శ్రీనివాస రావు, అధ్యక్షుడు NVT, ప్రధాన కార్యదర్శి తాళ్ల శ్రీధర్ గౌడ్, మై భారత్ నల్గొండ జిల్లా అధికారి రాజేష్ సభ్యులతో కలిసి క్రీడాకారులకు బహుమతులు అందజేసి శుభాకాంక్షలు తెలియజేసినారు. అనంతరం వారు మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో మెలగాలని క్రీడల వల్ల విద్యార్థులు మానసికంగా ఉత్సాహంగా ఉంటారని వారి మేధస్సు షార్ప్



గా పని చేస్తుందని స్నేహభావంతో మెలుగుతారని అన్నారు. దేవరకొండ నియోజకవర్గంలో ఎంతో నైపుణ్యం ఉన్న క్రీడాకారులు ఉన్నారని వారికి సరైన క్రీడాస్థలాలు అవసరమని అన్నారు. అలాగే దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమని క్రీడాకారులకు ఎంతో అండగా ఉంటున్నారని అభినందించారు. ఈ కార్యక్రమంలో రాజకుమార్ రెడ్డి, రమేష్, మై భారత్ నల్గొండ స్టాఫ్ కొండల్, వంగూరు వెంకటేశ్వర్లు, కరాటే మాస్టర్ గోపి, వినోద్, రాధాకృష్ణ, PET లు రజిత, మహేశ్వరి, అనూష, రామ్ చందర్, వెంకన్న, సంగీత, రాజు, రవి, కిరణ్, అశోక్, నిఖిల్, క్రీడాకారులు కళాకారులు తదితరులు పాల్గొన్నారు. 1, కబడ్డీ బాయ్స్ మొదటి బహుమతి కృష్ణవేణి టాలెంట్ స్కూల్, రెండవ బహుమతి మెటల్ డా స్కూల్, కబడ్డీ గర్ల్స్ మొదటి బహుమతి కృష్ణవేణి టాలెంట్ స్కూల్, రెండవ బహుమతి గురుకుల పాఠశాల, షటిల్ గర్ల్స్ సీనియర్స్ ఎం నాగ సంధ్య, రెండవ బహుమతి స్వాతి, జూనియర్స్ సుమజా శ్రీ రెండవ బహుమతి సింధు, తగ్గఫర్ మొదటి బహుమతి గురుకుల పాఠశాల, రెండవ బహుమతి కృష్ణవేణి టాలెంట్ స్కూల్, రన్నింగ్ ఎస్ ప్రత్యూష, రెండవ బహుమతి ఆర్ శిరీష గెలుపొందినారు,



# ఖాళీగా ఉన్న 40వేల ఉపాధ్యాయ పోస్టులకు వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలి

- నిరుద్యోగులతో విద్యాశాఖ కార్యాలయం ముట్టడి.. భారీ ధర్నా

**జయభేరి, హైదరాబాద్ ఫిబ్రవరి 26 :**

వివిధ ప్రభుత్వ పాఠశాలలో ఖాళీగా యున్న 40 వేల టీచర్ల భర్తీకి వెంటనే నోటిఫికేషన్ జారి చేయాలనీ ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. నేడు జాతీయ బి.సి సంక్షేమ సంఘం అధ్వర్యంలో లక్డికపుల్ విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం వద్ద భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమానికి ర్యాగ అరుణ్ కుమార్ మరియు నీల వెంకటేష్, అనంతయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య గారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఖాళీగా ఉన్నటువంటి ఉపాధ్యాయ పోస్టులకు వెంటనే నోటిఫికేషన్ విడుదల చేసి భర్తీ చేయాలని కోరారు. టీచర్ పోస్టులు భర్తీ చేయకపోవడంతో 12 వేల పాఠశాలలో ఇంగ్లీష్, మథ్స్, సైన్స్ పాఠాలు చెప్పేవారు లేరు. విద్యార్థులుకు ఈ సబ్జెక్టులో విషయ పరిజ్ఞానం లేక చదువుల్లో వెనుకబడి పోతున్నారు. దీనిలో బేసిక్ విషయ పరిజ్ఞానం లేక జాతీయ పరీక్షలలో పోటీలో నీట్, ఇంజనీరింగ్, మెడిసిన్ తదితర పోటీపరీక్షలలో ఇతర రాష్ట్రాలతో పోటీ పడలేకపోతున్నారు. ఈ ముట్టడి కార్యక్రమాన్ని ఉద్దేశించి బిసి జాతీయ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ అరుణ్ కుమార్ మాట్లాడుతూ సమాజంలో మార్పు గాని, చైతన్యంగానీ రావాలంటే ఉపాధ్యాయుల వలన సాధ్యమవుతుందని, మీరందరూ కూడా ప్రతి గ్రామంలో పాఠశాల ఉంటుంది బీసీల చైతన్యము తెచ్చి రాబోయే రోజుల్లో రాజ్యాధికారం లో భాగస్వాములు అయ్యేవిధంగా ఈ సమాజాన్ని చైతన్యం చేయాలని, యువతను కూడా సరైన దిశలో పయనించేటట్టు చేసే బాధ్యత మీ అందరి దన్నారు.ఈ ముట్టడి కార్యక్రమంలో నిరుద్యోగ జాక్ చైర్మన్ నీలం వెంకటేష్, రాజేందర్, అనంతయ్య, అంజి గౌడ్, శివ కుమార్ యాదవ్, అష్మా, సురేష్, కుమార్ ఇంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ పోలీస్ గేమ్స్ & స్పోర్ట్స్ మీట్ లో విజయ డంకా మ్రోగించిన నంద్యాల

**జయభేరి, హైదరాబాద్, ఫిబ్రవరి 26 :**

ఈనెల 16 నుండి 21 వరకు జరిగిన 4వ తెలంగాణ పోలీస్ గేమ్స్ & స్పోర్ట్స్ మీట్ 2026లో డాక్టర్ నర్సింహ రెడ్డి నంద్యాల మూడు పతకాలు సాదించి విజయ డంకా మ్రోగించారు. డబుల్స్‌లో రజత పతకం. సింగిల్స్‌లో కాంస్య పతకం. టీమ్ ఈవెంట్‌లో కాంస్య పతకం. సాదించారు. మార్చిలో ఢిల్లీలో 24022026 నుండి 2903 2026 వరకు జరగనున్న ఆల్ ఇండియా నేషనల్ లాన్ టెన్నిస్ ఛాంపియన్ షిప్‌కు కూడా అతను ఎంపికయ్యాడు.



# నూతన మహిళ సమైక్య భవనానికి శంకుస్థాపన

**జయభేరి, తుర్కపల్లి, ఫిబ్రవరి 26 :**

తుర్కపల్లి మండలం వెంకటాపూర్ గ్రామంలో నూతన మహిళా సమైక్య భవన నిర్మాణాన్ని సర్పంచ్ కర్రె మాధవి కరుణాకర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలను రూపొందించి గ్రామ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలోఉపసర్పంచ్ ఉదయ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు రావుల శ్రీనివాస్, కార్యదర్శి ధార మహేందర్, వర్కింగ్ ఇన్స్పెక్టర్ నవీన్, వార్డు సభ్యులు మహేష్, నాగరాజు, అనిల్, గుంటి నాగరాజు, గ్రామస్తులు ఉపేందర్, చంద్ర మౌళి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

- బచ్పన్ ఆక్స్ఫర్డ్ గ్రామర్ హైస్కూల్లో ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



**జయభేరి, దేవరకొండ :**

పట్టణంలోని బచ్పన్ ఆక్స్ఫర్డ్ గ్రామర్ హైస్కూల్లో గురువారం స్వపరిపాలన దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా, అధికారులుగా, ప్రజా ప్రతినిధులుగా వేషధారణలలో విధులు నిర్వహించి పలువురిని ఆకట్టుకున్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీస్తూ ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దడమే ముఖ్య ఉద్దేశమని ప్రధానోపాధ్యా గుద్దేటి జంగయ్య తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు.

# తెలంగాణ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర శాఖ ఎన్నికలు ఏకగ్రీవం శుభాకాంక్షలు









**జయభేరి, దేవరకొండ :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర శాఖ ఎన్నికలు ఎన్నికల అధికారి సమక్షంలో ఏకగ్రీవముగా సుందరయ్య విజ్ఞాన భవనములో నిర్వహించడం జరిగినది. రాష్ట్ర అధ్యక్షులుగా పి. వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా యం. సి లింగన్న, కోశాధికారిగా ప్రహల్లాద రావు కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ రాష్ట్రంలో పెన్షనర్స్ ఎదురుకుంటున్న సమస్యలపై ప్రభుత్వంతో మాట్లాడి పరిస్కారం కొరకు ప్రయత్నం చేస్తామని, ముఖ్యముగా EHS రిటైర్డ్ అయినవారి బకాయిలు చెల్లింపులు విషయంలో, PRC అమలు గురించి ప్రభుత్వంతో మాట్లాడి పరిస్కారం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్ర అధ్యక్షులు G దామోదర్ రెడ్డి, వారి కార్యవర్గం,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, అన్ని జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు, కౌన్సిల్ సభ్యులు పాలుగొన్నారు.దేవరకొండ యూనిట్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జగపతి రావు, జిల్లా కార్యదర్శులు కంచర్ల నారాయణ రెడ్డి, దేవరకొండ యూనిట్ అధ్యక్షులు తాడిశెట్టి నరసింహ, కార్యదర్శి అంకం చంద్రమౌళి పాలుగొన్నారు. దేవరకొండ యూనిట్ తరపున శుభాకాంక్షలు తెలియజేసినారు.

# ఫోటోగ్రాఫర్ల కొరకు మంచినీటి బోరు

- ఫోటో అసోసియేషన్ బిల్డింగ్ కొరకు 20వ వార్డు మాజీ కౌన్సిలర్ కొండ్ర మల్లీశ్వరి శ్రీశైలం యాదవ్ బోరు దాతగా సహకరించినారు



**జయభేరి, దేవరకొండ :**

వీడియో ఫోటో అసోసియేషన్ బిల్డింగ్ కొరకు 20వ వార్డు మాజీ కౌన్సిలర్ కొండ్ర మల్లీశ్వరి శ్రీశైలం యాదవ్ ఫోటోగ్రాఫర్ల కొరకు మంచినీటి వసతిని గుర్తించి బోరు వేయించడం జరిగినది వారికి ఫోటోగ్రాఫర్ యూనియన్ తరపున ప్రత్యేక ధన్యవాదాలు యూనియన్ తరపున తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కమిటీ అధ్యక్షులు సమడం జయరాములు, ప్రధాన కార్యదర్శి కళారి సందీప్, కోశాధికారి శివ , నల్గొండ జిల్లా ఫోటో కోశాధికారి భాస్కర్, మణిదీప్, గోపాల్, అశోక్, రాజు, ఇందు శీను, మహేష్, సునీల్ యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# మున్సిపాలిటీలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన


- కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంది : మున్సిపల్ చైర్మన్ శిరీష కృష్ణారెడ్డి

**జయభేరి, శామీర్ పేట్, ఫిబ్రవరి 26:**

అర్హులైన ప్రతి ఒక్కరికీ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తుందని అలియాబాద్ మున్సిపల్ చైర్మన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి అన్నారు. మేడ్చల్ జిల్లా అలియాబాద్ మున్సిపాలిటీలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు వారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులైన దుద్దేడ జానకి, చిక్కా లక్ష్మీ, సొప్పరి విజయ , జీనా సావిత్రి గార్లకు చెందిన ఇళ్లకు గాను మున్సిపల్ చైర్మన్ శంకుస్థాపన చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచి హామీలను అమలు చేస్తుందని స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే ఇళ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తుందన్నారు. ప్రజా పాలనే ప్రభుత్వ లక్ష్యమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 20వ వార్డు కౌన్సిలర్ మౌనిక మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమిలో ప్రైవేటు రియలెస్టేట్ ఆఫీసు

- జవహార్ నగర్ స.నెం 374లో దర్జాగా కబ్జాలు
- పక్కనే పోలీస్ స్టేషన్, అక్రమార్కులకు లేదు టెన్షన్
- ప్రధాన రోడ్డు పక్కనే అక్రమ నిర్మాణాలు, తొంగి చూడని రెవెన్యూ అధికారులు




**జయభేరి, కీసర సర్కిల్:-**

జి.హెచ్.ఎమ్.సి పరిధికి చెందిన జవహార్ నగర్ నగర్ లోని స.నెం 374 ప్రభుత్వ భూమిలో యధేచ్ఛగా కబ్జాల పర్వం జోరందుకుంది. ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం చేపట్టమే కాకుండ దర్జాగా రియల్ ఎస్టేట్ ఆఫీసునే ప్రారంభించారు కబ్జా దారులు. ప్రధాన రహదారి అందులో పక్కనే పోలీస్ స్టేషన్ వున్నప్పటికి యధేచ్ఛగా ప్రభుత్వ భూమిని కబ్జా చేసారంటే రెవిన్యూ అధికారుల మద్దతు వుందనే గుసగుసలు స్థానిక ప్రజల మధ్య నడుస్తున్నాయి. అయితే ఇప్పటి వరకు రెవెన్యూ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం, కనీసం అటువైపు తొంగి కూడ చూడక పోవడమనేది అక్రమార్కులకు మద్దతు ప్రకటించడమే అవుతుంది. ఇప్పటికైన రెవెన్యూ అధికారులు స్పందించి కోట్ల విలువైన స.నెం 374 ప్రభుత్వ భూమిని కాపాడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# మాదిగ హక్కుల దండోరా ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు తరలి వెళ్దాం

- మాదిగల ఐక్యతను చాటుదాం

**జయభేరి, గజ్వేల్, ఫిబ్రవరి 26 :**

ఎస్సీ వర్గీకరణ సాధనకై ఏర్పడిన (MHPS) మాదిగ హక్కుల దండోరా దినోత్సవం వేడుకలు హైదరాబాదులోని బషీర్బాగ్ ప్రెస్ క్లబ్ లో నిర్వహిస్తారని గౌరవ అధ్యక్షులు పెరుమాండ్ల రామకృష్ణ మరియు రాష్ట్ర అధ్యక్షులు సునీల్ మాదిగ పిలుపు మేరకు మాదిగ హక్కుల దండోర గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జ్ నల్ల నరేందర్ మాదిగ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదిగల హక్కుల కోసం నిర్వహించే ఆవిర్భవ దినోత్సవ వేడుకలకు మాదిగలందరూ తరలిరావాలని వారు పిలుపునిచ్చారు.

# అత్యాధునిక సంతాన సాఫల్య కేంద్రం అందుబాటులోకి రావడం అభినందనీయం

- కేశం పేట మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి
- శ్రీ శారద ఫెర్టిలిటీ అండ్ ఐవిఫ్ సెంటర్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి





**జయభేరి, షాద్ నగర్, ఫిబ్రవరి 26 :**

షాద్‌నగర్ పట్టణంలో నూతనంగా ఏర్పాటుచేసిన శ్రీ శారద ఫెర్టిలిటీ అండ్ ఐవిఫ్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ....షాద్‌నగర్ లో అత్యాధునిక వైద్య సదుపాయాలతో ఫెర్టిలిటీ అండ్ ఐవిఫ్ సెంటర్ ఏర్పాటు కావడం సంతాన సాఫల్యం కోసం పెద్ద పట్టణాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగా నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి రావడం ఆనందకరమని పేర్కొన్నారు. ఇటువంటి వైద్య సంస్థలు మరింతగా అభివృద్ధి చెందాలని ఆశిస్తూ నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి యాజమాన్యం పాల్గొన్నారు.

# కేవలం బీజేపీ పైనే ఇంత అక్కసు ఎందుకు!

- ఎవరి జెండా, ఎజెండా కోసం బీజేపీపై దాడులు?
- ఘాటుగా ప్రశ్నిస్తున్న నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, అందె బాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి

**జయభేరి, షాద్ నగర్, ఫిబ్రవరి 26 :**







రంగా రెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపాలిటీ ఎన్నికల అనంతరం సోషల్ మీడియాలో బీజేపీ పార్టీపై కావాలనే జరుగుతున్న, జరుపుతున్న దుష్ప్రచారాన్ని బీజేపీ నాయకులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, అందె బాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డిలు సంయుక్తంగా తీవ్రంగా ఖండించారు. ఎమ్మెల్యే నివసిస్తున్న వార్డులో బీజేపీ అభ్యర్థి విజయం సాధించడాన్ని జీర్ణించుకోలేకే ఈ దాడులు ప్రారంభమయ్యాయా? లేక ఎమ్మెల్యేపై పెరుగుతున్న ప్రజా వ్యతిరేకతను మళ్లించేందుకు బీజేపీని లక్ష్యంగా చేసుకుంటున్నారా? గత పదేళ్లు అధికారంలో ఉన్నవారి స్వంత వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ఈ విమర్శల పరంపర మొదలైందా? అని ముగ్గురు నేతలు సూటిగా ప్రశ్నిస్తున్నారు.

**కుమ్మక్కు రాజకీయాలు మాకు తెలియవు**

జాతి కోసం నమ్మిన సిద్ధాంతం కోసం ధర్మం కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అడుగుజాడల్లో నడుస్తూ అన్ని మతాలతో పాటు హైందవ ధర్మ ఐక్యతను కొనసాగిస్తూ హైందవ ధర్మం అగ్రభాగాన నిలబడాలని, అభివృద్ధి ధ్యేయంగా నిరంతరం ప్రజల పక్షాన నిలబడుతున్నామే కానీ తమకు లోలోపల రాజకీయాలు, కుమ్మక్కు రాజకీయాలు చేయడం చేతకాక కాదని అన్నారు

**విద్యావంతులకు యువతకు చోటిచ్చాం**

మున్సిపాలిటీ ఎన్నికల్లో ప్రత్యేకంగా 16వ వార్డులో బీసీ మహిళా వర్గానికి చెందిన విద్యావంతురాలైన డాక్టర్‌కు అవకాశం ఇవ్వడం జరిగింది. అదేవిదంగా 6వ వార్డులో పేద కుటుంబానికి చెందిన ఎస్టీ అభ్యర్థిని ముందుకు తేవడం జరిగింది. 25వ వార్డులో ఇంజనీరింగ్ చదివిన యువకుడిని అభ్యర్థిగా నిలబెట్టడం జరిగింది.

ఈ మూడు వార్డులను మాత్రమే ఎంచుకుని విమర్శలు చేయడం వెనుక ఉద్దేశం ఏమిటని వారు ప్రశ్నించారు. కేవలం ఈ మూడు వార్డులే కాదు, మొత్తం 19 వార్డులలో బీజేపీ చదువుకున్న యువత, సామాజిక సేవా భావం కలిగిన మహిళలు, వెనుకబడిన వర్గాలకు చెందిన ప్రతినిధులను అభ్యర్థులుగా నిలబెట్టిందని పేర్కొన్నారు. బిజెపి పార్టీ పట్ల ఉన్న అభిమానంతో ప్రస్తుత యువత ఎన్నికల్లో నిలబడి పోరాడి గెలవడానికి ఎంతో సాహసం చేసిందని అన్నారు. కొన్ని వార్డుల్లో గెలుపు అంచుల వరకూ వచ్చామని, స్వల్ప ఓట్ల తేడాతో వెనుకబడిన చోట్ల కూడా ప్రజా మద్దతు స్పష్టంగా పెరిగిందని తెలిపారు. అటు అధికార పక్షంలోనూ ఇటు ప్రతిపక్షంలోనూ తీవ్రమైన గ్రూప్ రాజకీయాలు నడుస్తున్నాయన్న విషయం ప్రజలకు తెలిసిందేనని, ఆ అంతర్గత విషయాలను బయట పెట్టడం చేతకాక అక్కడి అంతర్గత విభేదాలపై మౌనం పాటిస్తూ కేవలం బీజేపీలోనే విభేదాలు ఉన్నట్టు చిత్రీకరించడం వెనుక స్పష్టమైన స్వలాభం మరియు రాజకీయ కుట్ర ఉందని ఆరోపించారు. ఎదుగుతున్న బీజేపీలో ముసలం పెట్టి ప్రజల్లో, కార్యకర్తల్లో అయోమయం సృష్టించాలనే ప్రయత్నం జరుగుతోందని ఈ విషయాన్ని నియోజకవర్గ ప్రజలందరూ గమనిస్తున్నారని పేర్కొన్నారు.

**అభినందించాల్సింది పోయి...**

రాజకీయాల్లో తొలిసారి పోటీ చేసిన అభ్యర్థులను అభినందించాల్సింది పోయి, వారిని ప్రోత్సహించాల్సింది పోయి కావాలనే బీజేపీని టార్గెట్ చేయడం దురదృష్టకరమన్నారు. డబ్బు, మద్యం, అధికార ప్రభావంతో ఎన్నికలను ప్రభావితం చేసే పాత రాజకీయ సంస్కృతికి భిన్నంగా బీజేపీ విలువల రాజకీయాలను ముందుకు తీసుకువస్తోందని స్పష్టం చేశారు. దుష్ప్రచారాలతో బీజేపీ ఎదుగుదలను అడ్డుకోలేరని, షాద్‌నగర్‌లో పార్టీ మరింత బలోపేతం అవుతూ భవిష్యత్తులో బలమైన ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతుందని, కుళ్ళు కుతంత్రాల రాజకీయాలు బిజెపి నాయకులకు తెలవవని, ధర్మం కోసం పోరాటం, ధర్మాన్ని నిలబెట్టే ప్రయత్నం మాత్రమే తెలుసునని ముగ్గురు నేతలు ధీమా వ్యక్తం చేశారు.



# యాదగిరిగుట్ట మున్సిపల్ ఎనిమిది వార్డు కౌన్సిలర్ పేరబోయిన సత్యనారాయణ


- కళ్యాణ కానుక

**జయభేరి, యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 25 :**

యాదగిరిగుట్ట మున్సిపల్ 8వ వార్డు కౌన్సిలర్ పేరబోయిన సత్యనారాయణ యాదవ్ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి బుధవారం శ్రీకారం చుట్టారు. మొదటగా కళ్యాణ కానుకగా నామకరణం చేసుకొని బుధవారం పబ్బాల ఉప్పలయ్య కుమారుడు పబ్బాల సురేష్ -కృష్ణవేణికి 5016/ రూపాయలు అందజేశారు. ఈ కళ్యాణ వేడుకలో పబ్బాల రాజు, దండబోయిన నాగేష్, పల్లెపాటి రమేష్, పబ్బాల నరసింహ, పల్లెపాటి దుర్గ ప్రసాద్, గడ్డమీది వెంకటేష్ తో పాటు న్యూ ఫ్రెండ్స్ యూత్ సభ్యులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

# మున్సిపాలిటీ పరిధిలో ఘనంగా నూతన గృహ ప్రవేశం

- పాల్గొన్న మున్సిపల్ కౌన్సిలర్లు చీదు వనజ శ్రీనివాస్ రెడ్డి, గుదే వెంకటేష్



**జయభేరి, శామీర్ పేట్, ఫిబ్రవరి 26:**

అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నూతన గృహ ప్రవేశ కార్యక్రమం ఘనంగా జరిగింది. వేద పండితుల మంత్రోచారణల మధ్య నిర్వహించిన ఈ కార్యక్రమానికి మున్సిపల్ కౌన్సిలర్లు చీదు వనజ శ్రీనివాస్ రెడ్డి, గుదే వెంకటేష్, మురహరిపల్లి మాజీ సర్పంచ్ దార భాస్కర్ లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ సొంత ఇల్లు అనేది ప్రతి ఒక్కరి చిరకాల కోరిక అని, పేద ప్రజల కోరిక నెరవేర్చాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టి సొంతింటి కల నిజం చేస్తుందన్నారు. స్థానిక సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బాల్క సుమన్ బెయిల్ కేసు

- సుప్రీం కోర్టు గైడ్ లైన్స్ పాటించడంలేదు

**జయభేరి, మంచిర్యాల :**

మంచిర్యాల జిల్లా కోర్టులో బాల్క సుమన్ పై పోలీసులు పెట్టిన అక్రమ కేసులపై మా వాదనలు గట్టిగా వినిపించాం. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కావాలని బెయిల్ రాకుండా చేస్తున్నారని బాల్క సుమన్ తరపు న్యాయవాది లలిత రెడ్డి ఆరోపించారు. బెయిల్ పిటిషన్ పై వాదనలు వినాలన్న పట్టించుకోవడం లేదు. కస్టడీ పిటిషన్ పెండింగ్ లో ఉంది కాబట్టి బెయిల్ పిటిషన్ డిస్కస్ చేయమని అంటున్నారు. బాల్క సుమన్ అక్రమ అరెస్టులో పోలీసులు సుప్రీం కోర్టు గైడ్ లైన్స్ పాటించలేదు. క్యాతనపల్లి ఘటనలో ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే విధంగా వ్యవహరిస్తున్నదని అన్నారు.

# రెవిన్యూ భూముల కేటాయింపులపై అభ్యంతరం

**జయభేరి, తుర్కపల్లి, ఫిబ్రవరి 26 :**



తుర్కపల్లి మండల కేంద్రంలో రెవిన్యూ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములు చాలా తక్కువగా ఉన్నాయని భవిష్యత్తులో గ్రామ అభివృద్ధి కార్యక్రమాలు ప్రభుత్వ కార్యాలయాల విస్తరణ, ప్రజా అవసరాల కోసం రావాల్సిన స్థలం లేదని తుర్కపల్లి గ్రామ సర్పంచ్ సోమల వెంకటేశం, ఉప సర్పంచ్ పల్లె నరేష్ గౌడ్ లు అన్నారు. గురువారం తుర్కపల్లి మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ రవికుమార్ గ్రామపంచాయతీ పాలకవర్గం సన్మానించారు. అనంతరం వారు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో ప్రభుత్వ భూములను కేటాయించకూడదని, ఇప్పటికే కేటాయించిన భూములను కూడా తక్షణమే రద్దు చేయాలని కోరుతూ గ్రామపంచాయతీ తీర్మానాన్ని తహసిల్దార్ కు అందజేశారు. గ్రామ అభివృద్ధి పనులు, కొత్త ప్రభుత్వ కార్యాలయాలు నిర్మాణం, గ్రామపంచాయతీ కార్యాలయ విస్తరణ, పార్కులు, కమ్యూనిటీ హాల్ వంటి ప్రజా అవసరాల కోసం భూమి అత్యవసరమని అన్నారు. గ్రామ జనాభా పెరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతం ఉన్న రెవిన్యూ భూములను పరిరక్షించాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రజా ప్రయోజనాల కంటే వ్యక్తిగత కేటాయింపులు ప్రాధాన్యత పొందకూడదని ప్రభుత్వ భూములు గ్రామ అభివృద్ధికి మాత్రమే వినియోగించాలని అన్నారు. గ్రామంలో అందుబాటులో ఉన్న రెవిన్యూ భూముల వివరాలు భవిష్యత్తు అవసరాల అంచనా ఇప్పటికే జరిగిన కేటాయింపుల పై అభ్యంతరాలను స్పష్టంగా వివరించారు. ఈ విషయాన్ని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సముచిత చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామ అభివృద్ధి ప్రజల అవసరాల కోసం ఉన్న భూములను కాపాడడం గ్రామ పంచాయతీ సర్పంచిగా తన బాధ్యత అని ప్రభుత్వ భూములు గ్రామ ప్రజల సొత్తు అని వాటిని సమాజ ప్రయోజనాలకు మాత్రమే వినియోగించాలని అన్నారు. ఇప్పటినుండి గ్రామపంచాయతీ తీర్మానం లేకుండా గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూములను ఎలాంటి కేటాయింపులు జరుపకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు భోయిని అరవింద్, సోమల కర్ణాకర్, బండారి రవి, కోట భాగ్యలక్ష్మి విజయ్, కోట జాన్సన్, గుండబోయిన రమణా రమేష్, తరణి సుమని శ్రీహరి, కాసబోయిన కవిత రాజమౌళి, షేక్ నజీర్, తదితరులు పాల్గొన్నారు.

# 16 కోట్ల ఇంజక్షన్ కోసం కదం తొక్కిన ఆదరణ ఫ్రెండ్స్ గ్రూప్ ఆఫ్ సోషల్ సర్వీస్

**జయభేరి, దేవరకొండ :**



6 కోట్ల ఇంజక్షన్ కర్నూల్ జిల్లాలో పునర్విక కోసం కదం తొక్కిన ఆదరణ ఫ్రెండ్స్ గ్రూప్ ఆఫ్ సోషల్ సర్వీస్ కర్నూలు జిల్లాలోని వెల్దుర్తి కి చెందిన సురేష్ కుమార్ పుష్పవతి దంపతులకు పునర్విక శ్రీ జన్మించిన 11 నెలలకు స్పైనల్ మాస్కులర్ అరుదైన వ్యాధితో బాధపడుతూ ఆ పాపకు వ్యాధి నయం కావాలంటే 16 కోట్ల రూపాయల ఇంజక్షన్ అవసరమని డాక్టర్లు తెలపడంతో మన తెలుగు రాష్ట్రాలలో సోషల్ మీడియా కోడై కూర్చున్న తరుణంలో ఆ పాపకు సహాయం చేయాలనే ఉద్దేశంతో మేమున్నామని ఆదరణ ఫ్రెండ్స్ గ్రూప్ ఆఫ్ సోషల్ సర్వీస్ ముందలికి వచ్చి కర్నూలు జిల్లాలోని వెల్దుర్తికి గ్రామానికి వెళ్లి ఆదరణ ఫ్రెండ్స్ గ్రూప్ ఆఫ్ సోషల్ సర్వీస్ సభ్యులు ఆ చిన్నారిని చూసి తల్లిదండ్రులకు ఆ చిన్నారి ఇంజక్షన్ కోసం మన ఆదరణ ఫ్రెండ్స్ గ్రూప్ ఆఫ్ సోషల్ సర్వీస్ 38500 ఆర్థిక సహాయం అందజేశారు. ఆదరణ ఫ్రెండ్స్ గ్రూప్ ఆఫ్ సోషల్ సర్వీస్ చైర్మన్ పందిరి జ్యోతి వెంకన్న మాట్లాడుతూ మన రాష్ట్రంలోనే కాకుండా ఇతర రాష్ట్రంలో అరుదైన వ్యాధితో బాధపడుతున్న పునర్వికకు ఆర్థిక సహాయం చేయడం నాకు ఎంతో ఆనందంగా ఉందని ఇప్పటివరకు మన ఆదరణ ఫ్రెండ్స్ గ్రూప్ ఆఫ్ సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో ఎంతోమంది చిన్నారులకు ఆర్థిక సహాయం చేయడంతో పాటు కరోనా సమయంలో ఆక్సిజన్ వెంటిలేషన్ మిషన్ తీసుకొచ్చి ఎంతోమందికి ఆదరణ ఫ్రెండ్స్ గ్రూప్ ఆఫ్ సోషల్ సర్వీస్ సహాయపడిందని అదేవిధంగా ఇంకా ముందు ముందు ప్రతి ఒక్కరి సహాయ సహకారాలతో ఇంకో ఎన్నో కార్యక్రమాలు చేయాలని మేము ముందుకు వచ్చామని ఆమె కొనియాడారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ పందిరి జ్యోతి వెంకన్న కార్యదర్శి కొమ్మనేని ఆంజనేయులు యాదవ్ ఉపాధ్యక్షులు నీల సంజీవ్ కుమార్ ఆలంపల్లి పద్మ ముశిని అంజన్ దాచేపల్లి రమేష్ కల్పన MRO అమిన్ సింగ్ రాజశేఖర్ దొడ్డి శారద రాపోలు మల్లిక ఆలంపల్లి దీపిక సముద్రాల రేణుక నీలిమ లెండల వినిలా సముద్రాల వేణు సత్య శ్రీ కుంచకూరి అశోక్ సంధ్యా రాణి గుండా రాజారావు మరియు ఆదరణ ఫ్రెండ్స్ గ్రూప్ ఆఫ్ సోషల్ సర్వీస్ సభ్యుల సహకారంతో చిన్నారికి ఆర్థిక సహాయం అందజేయడం జరిగినది.

# భీమా నాయక్ వర్ధంతి ఘన నివాళులు




జయభేరి, దేవరకొండ :

బంజార సమాజాన్ని ఏకతాటిపైకి తీసుకువచ్చి, వారిలో రామావత్ భీమా నాయక్ చైతన్యం నింపారని దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ తెలిపారు. అఖిల భారత బంజార సేవా సంఘం మాజీ అధ్యక్షులు, బంజార సమాజం కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు రామావత్ భీమా నాయక్ 9వ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం బంజార భవనంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భీమా నాయక్ విగ్రహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మాజీ మంత్రి జానారెడ్డి శిష్యుడిగా పేరుగాంచి, సర్పంచ్ గా సింగిల్ విండో చైర్మన్ గా డిసిసిబి డైరెక్టర్గా, అఖిల భారత బంజార సేవా సంఘం అధ్యక్షులుగా భీమా నాయక్ చేసిన సేవలను స్మరించుకున్నారు. బంజారుల హక్కుల సాధన కోసం ఆయన జీవితాంతం చేసిన కృషి అజరామరణమని, సమాజ అభ్యున్నతికి ఆయన చూపిన మార్గం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. బంజారా భవన నిర్మాణం కొరకు కీలక పాత్ర పోషించాలని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, కౌన్సిలర్లు రూపుల నాయక్, శ్రీ కన్య సేవియా నాయక్ మాజీ కౌన్సిలర్ జయప్రకాష్‌నాయక్, బంజారా సంఘం నాయకులు లక్ష్మణ్ నాయక్, బిక్కు నాయక్,పాపా నాయక్, ఎల్ఐసి సీనియర్ బ్రాంచ్ మేనేజర్ రాము చౌహన్, పాండు నాయక్,ధరమ్ సింగ్, గోపాల్ సింగ్,యువజన కాంగ్రెస్ నాయకులు ఇతర ప్రముఖులు పాల్గొని భీమా నాయక్ ఘనంగా నివాళులర్పించారు.

# పేదవారి ఇంటి కల కాంగ్రెస్ తోనే సాధ్యం

- మాజీ కౌన్సిలర్, కాంగ్రెస్ నేత రామన్న గారి మణికంఠ గౌడ్



జయభేరి, మేడ్చల్ :

పేదవారి ఇంటి కల కాంగ్రెస్ తోనే సాధ్యమని 6వ వార్డు మాజీ కౌన్సిలర్, కాంగ్రెస్ నేత రామన్న గారి మణికంఠ గౌడ్ అన్నారు. మేడ్చల్ డివిజన్ పరిధిలోని 6వ వార్డులో నిర్మించుకున్న రెండు ఇందిరమ్మ ఇండ్లను మాజీ కౌన్సిలర్ రామన్నగారి మణికంఠ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కొత్తగా ఇండ్లను నిర్మించుకున్న చెలిమి మల్లేష్ సుభద్ర, వినయ్ వినోద్ శ్రీలేఖ, దంపతులకు సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటాన్ని మణికంఠ గౌడ్ బహుమతిగా వారికి అందజేశారు. ఈ సందర్భంగా మజీ కౌన్సిలర్ రామన్న గారి మణికంఠ గౌడ్ మాట్లాడుతూ సొంత ఇల్లు నిర్మించుకోవాలన్న ఆశలు ప్రతి ఒక్కరికి ఉంటాయని, అయితే ఆ ఆశలు కేవలం సీఎం రేవంత్ రెడ్డి తోనే సాధ్యమని, పేదవారి జీవితాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం వెలుగు నింపుతుందని తెలిపారు. 6వ వార్డుకు అడుగగానే 60 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసిన డిసిసి అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ కు, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డికి, హరి వర్ధన్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు రామన్నగారి మణికంఠ గౌడ్ పేర్కొన్నారు. 60 ఇండ్లను పేదవారికి తన చేతుల మీదుగా అందజేయడం ఆనందంగా ఉందని మణికంఠ గౌడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు ex ఎంపీటీసీ రమేష్, సూరి, శ్రీనివాస్, రాములు, దర్శన్, అంజి, పంజగరి శ్రీనివాస, మోనార్కు తదితరులు పాల్గొన్నారు.

# ఇథనైల్ లీక్ కావడమే మరణానికి కారణం



జయభేరి, హైదరాబాద్:

రాజమహేంద్రవరంలో చోటుచేసుకున్న కల్తీ పాల కలకలంపై రాష్ట్ర ప్రభుత్వం వేగంగా స్పందిస్తోంది. పాలను చల్లబరిచే మేషిన్‌లో కూలెంట్‌గా వాడే ఇథలిన్ గ్లైకాల్ లీక్ అయి పాలలో కలవడమే మరణాలకు దారితీసిందని అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. పాలలో యూరియా కలిస్తే కిడ్నీ సమస్య రావడానికి, లివర్ దెబ్బతినడానికి కొంత కాలం పడుతుందని అధికారులు తెలిపారు. మంగళగిరిలోని ఆరోగ్య శాఖ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆరోగ్య శాఖ కమిషనర్ వీరపాండియన్, ఐపీఎం డైరెక్టర్ నీలకంఠారెడ్డి కీలక వివరాలు వెల్లడించారు. కల్తీ పాలు తాగిన ఘటనలో ఇప్పటివరకు ఆరుగురు మరణించగా, ప్రస్తుతం 15 మంది బాధితులు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వీరిలో ఏడుగురి పరిస్థితి విషమంగా ఉందని, ఐదు నెలల చిన్నారితో పాటు ఇద్దరు చిన్నారులు కూడా చికిత్స పొందుతున్నారని వారు తెలిపారు.పోలీసుల ప్రాథమిక విచారణ ప్రకారం, పాలను చల్లబరిచే యంత్రంలో కూలెంట్‌గా వాడే ఇథలిన్ గ్లైకాల్ లీక్ అయి పాలలో కలవడమే ఈ ప్రమాదానికి కారణమని భావిస్తున్నారు. పాలలో యూరియా కలిసినట్లు వస్తున్న వార్తలను కమిషనర్ కొట్టిపారేశారు. ఒకవేళ యూరియా కలిస్తే కిడ్నీ సమస్యలు రావడానికి చాలా కాలం పడుతుందని, కానీ ఇథలిన్ గ్లైకాల్ ప్రభావం 34 రోజుల్లోనే తీవ్రంగా ఉంటుందని వివరించారు. బాధితుల చికిత్స కోసం చెన్నై, ముంబైల నుండి ప్రత్యేక మందులను తెప్పిస్తున్నట్లు పేర్కొన్నారు.బాధితుల ఇళ్ల నుంచి పెరుగు, నెయ్యి, వెనిగర్ వంటి 10 రకాల నమూనాలను సేకరించి పరీక్షల కోసం హైదరాబాద్, కాకినాడ ల్యాబ్‌లకు పంపారు. వీటి ఫలితాలు బుధవారం నుండి శనివారం మధ్య దశలవారీగా రానున్నాయి. ఈ ఫలితాల ఆధారంగా కల్తీకి సంబంధించి పూర్తి స్పష్టత రానుంది. ఇప్పటికే 110 కుటుంబాలకు చెందిన 315 మందికి రక్త పరీక్షలు నిర్వహించగా, క్రియాటినిన్ స్థాయి ఎక్కువగా ఉన్న ముగ్గురిని ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు.

**పాల విక్రయ, నిల్వ కేంద్రాల్లో తనిఖీలు**

ముందస్తు జాగ్రత్తగా ప్రభావిత ప్రాంతాల్లో డాక్టర్లను అందుబాటులో ఉంచారు. మరో నెల రోజుల పాటు ఇలాగే కొనసాగుతుందని కమిషనర్ తెలిపారు. మరోవైపు, ఈ ఘటనపై పోలీసు విచారణ ముమ్మరంగా సాగుతోంది. బుధవారం నుండి రాష్ట్రవ్యాప్తంగా పాల విక్రయ, నిల్వ కేంద్రాలలో తనిఖీలు నిర్వహించి, లైసెన్సులు లేని వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు ఐపీఎం డైరెక్టర్ నీలకంఠారెడ్డి హెచ్చరించారు.కల్తీ పాలు తాగి చనిపోయిన వారి కుటుంబాలకు ప్రభుత్వం ఇదివరకే పరిహారాన్ని ప్రకటించింది. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు మంగళవారం సాయంత్రం తూర్పు గోదావరి కలెక్టర్ కీర్తి చేకూరి, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, రుడా ఛైర్మన్ బీవీఆర్ చౌదరి నేతృత్వంలో వారికి చెక్కులు అందజేశారు. చౌడేశ్వరీనగర్‌కు చెందిన శేషగిరిరావు, గాంధీపురానికి చెందిన తాడి రమణి, తాడి కృష్ణవేణి కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం అందించారు. రాజానగరానికి చెందిన రాధాకృష్ణమూర్తి కుటుంబానికి ఎమ్మెల్యే బలరామకృష్ణ, ఆర్డీవో కృష్ణనాయక్‌లు పది లక్షల పరిహారం చెక్కు అందజేశారు.

**గణేశ్ కు రిమాండ్**

రాజమండ్రిలో తీవ్ర విషాదం నింపిన కల్తీ పాల ఘటనలో ప్రధాన నిందితుడు, వరలక్ష్మి మిల్క్ డెయిరీ యజమాని అడ్డాల గణేష్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం కోర్టులో హాజరు పరచగా, న్యాయమూర్తి అతనికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. దీంతో పోలీసులు అతడిని రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. డీఎస్పీ దేవకుమార్ తెలిపిన సమాచారం ప్రకారం పాల వ్యాపారి గణేశ్ కోరుకొండ మండలం నరసాపురంలో ఎలాంటి అనుమతులు లేకుండా డెయిరీని నిర్వహిస్తున్నాడని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు, లాభాపేక్షతో పాలల్లో నీళ్లు కలిపి ప్రజలకు పోసేవాడన్నారు. ఈ నెల 14న తక్కువగా పాలు సేకరించడం వల్ల పాలు చిక్కగా కనిపించేందుకు యూరియా, డిటర్జెంట్ పొడి, నూనె వంటి పదార్థాలు కలిపి కల్తీ చేశాడని చెప్పారు. కల్తీ చేసిన పాలను ఫ్రిజ్ లో నిల్వ చేయడం వల్ల కూలెంట్ ఆయిల్ లీకై పాలు కలుషితమయ్యాయని తెలిపారు.



# కొల్తూర్ గ్రామంలో పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన

- ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు - ఎమ్మెల్యే మల్లారెడ్డి

జయభేరి, శామీర్ పేట్, ఫిబ్రవరి 26:

ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు అని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. మూడు చింతల పల్లి మున్సిపాలిటీ పరిధిలోని కొల్తూర్ గ్రామంలో శ్రీ పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఆలయ సిబ్బంది ఎమ్మెల్యే మల్లారెడ్డిని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. గ్రామంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని, ప్రతి ఒక్కరూ కూడా ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జాం రవి, వైస్ చైర్మన్ శశిరేఖ,తుంకుంట మున్సిపల్ అధ్యక్షుడు నోముల శ్రీనివాస్ రెడ్డి,వంగ వెంకట్ రెడ్డి,డీసీఎంఎస్ మాజీ వైస్ చైర్మన్ మధుకర్ రెడ్డి, ఏఎంసి మాజీ వైస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, కౌన్సిలర్లు, స్థానిక నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటికి క్యూఆర్ కోడ్

- పౌర సేవలు మరింత సులభతరం



జయభేరి, విజయవాడ, ఫిబ్రవరి 26 :

ఏపీలో పౌర సేవలను మరింత సులభతరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆస్తి పన్ను చెల్లింపులు, ఇతర పురపాలక సేవల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా సరికొత్త సాంకేతిక విధానాన్ని అందుబాటులోకి తీసుకురానుంది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని అన్ని నగరాలు, పట్టణాల్లో ప్రతి ఇంటికీ, వాణిజ్య భవనానికీ ఒక ప్రత్యేక క్యూఆర్ కోడ్ను ఏర్పాటు చేయనున్నారు. ఈ విధానం ద్వారా ప్రజలు తమ స్మార్ట్‌ఫోన్తో క్యూఆర్ కోడ్ను స్కాన్ చేసి, ఇంటి నుంచే సులభంగా పన్నులు చెల్లించవచ్చు.ఈ కొత్త విధానాన్ని త్వరలోనే అమల్లోకి తీసుకురావడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ప్రతి ఇంటి గోడకు లేదా డోర్కు ఈ క్యూఆర్ కోడ్ను అంటించనున్నారు. పౌరులు తమ ఫోన్తో ఈ కోడ్ను స్కాన్ చేయగానే, ఆ ఇంటికి సంబంధించిన పూర్తి వివరాలు కనిపిస్తాయి. ఇంటి విస్తీర్ణం, ఏటా చెల్లించాల్సిన ఆస్తి పన్ను మొత్తం, ఏవైనా బకాయిలు ఉంటే ఆ వివరాలు స్పష్టంగా తెలుసుకోవచ్చని అధికారులు వివరించారు.

# కేరళ స్టోరీ 2 విడుదలపై హైకోర్టు స్టే

జయభేరి, తిరువనంతపురం :

ది కేరళ స్టోరీ 2 సినిమా విడుదలపై కేరళ హైకోర్టు స్టే విధించింది. సినిమాలో వివాదాస్పద అంశాలున్నాయని పేర్కొంది. మూవీ చూడకుండానే సెన్సార్ బోర్డు సెన్సార్ సర్టిఫికెట్ ఇచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ సినిమా మతవిద్వేషాలు రెచ్చగొట్టేలా ఉందంటూ దాఖలైన పిటిషన్లపై రెండు రోజుల క్రితం హైకోర్టు లో విచారణ జరిపింది. సినిమా చూశాకే నిర్ణయం చెబుతామన్నది. ఈక్రమంలోనే సినిమా చూసిన తరువాత స్టే ఇచ్చింది.




# టాలీవుడ్ లో హ్యాపీ కపుల్

జయభేరి, హైదరాబాద్, ఫిబ్రవరి 26:

టాలీవుడ్‌లో ఆన్‌స్క్రీన్ కెమిస్ట్రీతో మొదలైన పరిచయం ఆఫ్‌స్క్రీన్ ప్రేమగా మారి పెళ్లి వరకు చేరిన జంటగా విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నా నిలిచారు. వీరి పరిచయం గీత గోవిందం మూవీ టైమ్ లో మొదలైంది. ఆ సినిమా బ్లాక్‌బస్టర్ కావడంతో ఇద్దరి మధ్య స్నేహం మరింత బలపడింది. ఆ తర్వాత డియర్ కామ్రేడ్ టైమ్ లో ఆ స్నేహం ప్రేమగా మారిందనే టాక్ అప్పట్లోనే వినిపించింది. సినిమా పెద్దగా వర్కౌట్ కాకపోయినా, ఆ మూవీ తమకు ఎంతో స్పెషల్ అని ఇద్దరూ పలు సందర్భాల్లో చెప్పడం విశేషం. గత కొన్నేళ్లుగా రిలేషన్‌లో ఉన్నారనే వార్తలు వచ్చినా, ఎప్పుడూ అధికారికంగా స్పందించలేదు.మొదట్లో మేము ఫ్రెండ్స్ మాత్రమే అని చెప్పుకుంటూ వచ్చిన ఈ జంట, ఫిబ్రవరి 22న పెళ్లితో తమ రిలేషన్‌ను అఫీషియల్‌గా ప్రకటించింది. పలు షోలలో రష్మికను "ఎలాంటి వ్యక్తిని పెళ్లి చేసుకుంటారు?" అని అడిగితే, ఆమె తరచూ విజయ్ దేవరకొండ పేరే చెప్పడం అభిమానుల్లో ఆసక్తి రేపింది. గతేడాది సీక్రెట్‌గా ఎంగేజ్‌మెంట్ చేసుకున్నారు ఈ జంట. ఎంగేజ్‌మెంట్ తర్వాత రిలీజైన ది గర్ల్ ఫ్రెండ్మూవీ విజయం అందుకోగా, ఆ సక్సెస్ మీట్‌లో గెస్ట్‌గా వచ్చిన విజయ్, అందరి ముందూ ఆమె చేతిని ముద్దాడడం చర్చనీయాంశమైంది. అదే వేదికపై ప్రతి ఒక్కరి లైఫ్‌లో ఒక విజయ్ దేవరకొండ ఉండాలంటూ రష్మిక చెప్పిన మాటలు వారి బాండింగ్‌ను స్పష్టంగా తెలియజేశాయి.విజయ్‌తో మాత్రమే కాకుండా, అతని తమ్ముడు ఆనంద్, తల్లి మాధవితోనూ రష్మికకు మంచి అనుబంధం ఉంది. ఆనంద్ సినిమాల ఈవెంట్లకు గెస్ట్‌గా హాజరై ఎంకరేజ్ చేయడం ఆమె కుటుంబంతో కలిసిపోయిందనే దానికి గొప్ప నిదర్శనం. ఇకమాధవిని తన తల్లి తర్వాత తల్లిగా భావిస్తానని చెప్పిన రష్మిక, ఇప్పుడు అధికారికంగా దేవరకొండ కుటుంబంలో అడుగు పెట్టబోతోంది. మరికొన్ని గంటల్లో రష్మిక దేవరకొండ ఇంటి కోడలిగా మారబోతుండగా, ఈ ప్రేమకథ టాలీవుడ్‌లో మరో హ్యాపీ కపుల్ స్టోరీ గా నిలవనుంది.

# 45మంది ఐఏఎస్ అధికారుల బదిలీ




జయభేరి, హైదరాబాద్, ఫిబ్రవరి 26 :

తెలంగాణ ప్రభుత్వ యంత్రాంగంలో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. పరిపాలనను మరింత వేగవంతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం 45 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ బదిలీలలో భాగంగా అత్యంత కీలకమైన సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) బాధ్యతలను రాహుల్ బొజ్జాకు అప్పగించారు. ఆయన జీఏడీ ముఖ్యకార్యదర్శిగా వ్యవహరిస్తూనే, బీసీ సంక్షేమ శాఖ అదనపు బాధ్యతలను కూడా చూసుకోనున్నారు. సీనియర్ అధికారుల బాధ్యతల్లోనూ ప్రభుత్వం పలు మార్పులు చేసింది. పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సంజయ్ కుమార్‌ను, రెవెన్యూ మరియు విపత్తు నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా దాన కిషోర్‌ను నియమించింది. ఆర్థిక మరియు ప్రణాళికా విభాగం కార్యదర్శిగా గౌరవ్ ఉప్పల్ బాధ్యతలు చేపట్టనుండగా, దేవాలయాల పర్యవేక్షణ బాధ్యతను ఎం. హనుమంతరావుకు (దేవదాయ శాఖ కమిషనర్) అప్పగించారు.ప్రజల సమస్యల పరిష్కార వేదిక 'ప్రజావాణి' రాష్ట్ర నోడల్ అధికారిగా డి. దివ్యను నియమించడం గమనార్హం. కేవలం సచివాలయ స్థాయిలోనే కాకుండా జిల్లాల పాలనలోనూ ప్రభుత్వం ప్రక్షాళన చేపట్టింది. పలు జిల్లాల కలెక్టర్లను మారుస్తూ తీసుకున్న నిర్ణయంలో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా కొత్త కలెక్టర్‌గా అనురాగ్ జయంతి నియమితులయ్యారు. ఈ భారీ బదిలీల ద్వారా పాలనలో కొత్త ఉత్తేజం తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రభుత్వం జిల్లా యంత్రాంగంలో మార్పులతోపాటు కీలక శాఖల్లో ఉన్న అధికారులను కూడా ట్రాన్స్‌ఫర్ చేసింది ప్రభుత్వం. ఇప్పటి వరకు పరిశ్రమల, ఐటీ శాఖ స్పెషల్ సెక్రటరీగా ఉన్న సంజయ్‌కుమార్‌ను పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు మార్చారు. పంచాయతీ రాజ్ శాఖలో ఉన్న శ్రీధర్‌ను ఐటీ, పరిశ్రమల ప్రిన్సిపల్ సెక్రటరీగా తీసుకొచ్చారు. దీంతోపాటు మైనింగ్, జియాలజీ శాఖ బాధ్యతలను ఆయనకు అదనంగా కేటాయించారు. రాహుల్‌బొజ్జాను సాగునీటి శాఖనుంచి సాధారణ పరిపాలన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా బదిలీ చేశారు. ఆయనకు బీసీ సంక్షేమ శాక అదనపు బాధ్యతలను అప్పగించారు. ఆ శాఖ బాధ్యతలు చూస్తున్న ఈ శ్రీధర్‌ను సాగునీటి పారుదల శాఖకు మార్చారు.

ప్రభుత్వానికి అత్యంత కీలకమైన ఆర్థిక శాఖలో కూడా మార్పులు చేపట్టారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో కోఆర్డినేషన్ సెక్రటరీగా ఉన్న గౌరవ్ ఉప్పల్‌ను ఆర్థిక, ప్రణాళిక శాఖ సెక్రటరీగా బదిలీ చేశారు. ఆయనకు తెలంగాణ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. విద్యుత్ రంగంలో సంస్కరణల్లో భాగంగా ముషార్ అలీ ఫరూఖీని కొత్తగా ఏర్పాటు చేయనున్న మూడో డిస్కిమ్‌కు సీఎండీగా నియమించారు. జితేష్ వి. పాటిల్‌ను టీజీఎస్పీడీసీఎల్ సీఎండీగా నియమించారు.

**జిల్లా కలెక్టర్లకు స్థాన చలనం**

ప్రభుత్వంలోని కీలక శాఖల్లోనే కాకుండా జిల్లా కలెక్టర్లను కూడా ప్రభుత్వం మార్చింది. పది జిల్లాలకుపైగా కలెక్టర్లకు ట్రాన్స్‌ఫర్ చేసింది. జిల్లా యంత్రాంగంలో యువతకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చింది. మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్‌గా విజియేంద్ర స్థానంలో కుష్బూ గుప్తాను నియమించింది. కరీంనగర్‌కు పమేలా సత్పతి స్థానంలో కొత్త కలెక్టర్‌గా చిత్రా మిశ్రాకు బాధ్యతలు అప్పగించారు. యాదాద్రి భువనగిరికి హనుమంతురావు స్థానంలో అనురాగ్ జయంతిని తీసుకొచ్చారు. మెదక్ జిల్లాకు రాహుల్ రాజ్ స్థానంలో ప్రతిమ సింగ్‌ను తెచ్చారు. హన్మకొండ జిల్లా కలెక్టర్‌గా స్నేహ శబరీష్‌ను బదిలీ చేసి చాహత్ బాజ్‌పాయ్‌కి ఛాన్స్ ఇచ్చారు. వికారాబాద్‌లో ప్రతీక్ జైన్ స్థానంలో దీపక్ తివారీని నియమించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్‌గా అంకిత్‌ను జితేష్ వి పాటిల్ స్థానంలో తెచ్చారు. నారాయణపేట జిల్లాకు సిక్తా పట్నాయక్ స్థానంలో ప్రతీక్‌జైన్‌ను బదిలీ చేశారు.

**ప్రజావాణికి యువ అధికారులు**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టే ప్రజావాణి కార్యక్రమానికి స్టేట్ నోడల్ ఆఫీసర్‌గా డి. దివ్యను నియమించారు. అదనపు నోడల్ ఆఫీసర్‌గా ఎం సురేందర్ బాధ్యతలు నిర్వర్తిస్తారు. గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా సంతోష్‌బిఎంను దేవాదాయ శాఖ డైరెక్టర్‌గా ఎం. హనుమంత రావును ప్రభుత్వం నియమించింది. ఆయనకు గోదావరి పుష్కరాల స్పెషల్ ఆఫీసర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది

## ప్రశంసలు కురిపించిన హీరోయిన్ జాన్వీ



ఆంధ్రప్రదేశ్ ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ పై బాలీవుడ్ స్టార్ హీరోయిన్ జాన్వీ కపూర్ ప్రశంసలు కురిపించింది. ఇటీవల ఆయన తీసుకున్న ఒక నిర్ణయం పై ఆమె సోషల్ మీడియా వేదికగా స్పందించిది. ఈమేరకు జాన్వీ చేసిన ట్వీట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

అసలు విషయంలోకి వెళితే.. ఆంధ్రప్రదేశ్ లోని కర్నూలు జిల్లాకు చెందిన చిన్నారి పునర్విక SMA టైప్1 అనే అత్యంత అరుదైన , ప్రమాదకరమైన వ్యాధితో బాధపడుతోంది. ఈ జబ్బు సోకిన వారి కండరాలు క్రమంగా బలహీనపడి, శ్వాస తీసుకోవడం కూడా కష్టమవుతుంది. చికిత్స లో భాగంగా పాపకు ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన 'జోల్గెన్స్మా' అనే ఇంజెక్షన్ ఇవ్వాల్సి ఉంటుందని వైద్యులు తెలిపారు . అయితే ఈ ఇంజెక్షన్ ఖరీదు అక్షరాలా రూ. 16 కోట్లు. అంత స్తోమత లేని తల్లిదండ్రులు దాతలను ఆశ్రయించారు. తమ కూతురు చికిత్సకు ఆర్థిక సాయం అందించి కాపాడాలని కోరారు. ఈ క్రమంలో మానవత్వం ఇంకా బతికే ఉందని నిరూపిస్తూ చాలా మంది పునర్విక ఫ్యామిలీకి ఆర్థిక సాయం చేశారు. ఈ క్రమంలోనే విరాళాల ద్వారా రూ. 10 కోట్ల సమకూరగా, మరో రూ. 6 కోట్లు అవసరమయ్యాయి. ఇక్కడే ఏపీ మంత్రి నారా లోకేశ్ తన గొప్ప మనసును చాటుకున్నారు. పునర్విక చికిత్స కోసం మిగిలిన రూ. 6 కోట్లు అందేలా చూసే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. ఈ మేరకు ట్విట్టర్ (ఎక్స్) వేదికగా కీలక ప్రకటన చేశారాయన.




## తక్కువ రన్‌టైంతో రాబోతున్న 'విష్ణు విన్యాసం'.. శ్రీవిష్ణు హిట్టు కొట్టేనా..?


టాలీవుడ్ యంగ్ హీరో, 'కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్' శ్రీవిష్ణు ప్రస్తుతం వరుస విజయాలతో ఫుల్ జోష్‌లో ఉన్నాడు. ఆయన కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'విష్ణు విన్యాసం' ఫిబ్రవరి 27న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అయితే ఈ సినిమా రన్‌టైమ్ కేవలం 1 గంటా 59 నిమిషాలు మాత్రమే ఉంటుందని చిత్రబృందం అధికారికంగా ప్రకటించడంతో ప్రస్తుతం ట్రేడ్ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. సాధారణంగా కామెడీ ఎంటర్‌టైనర్లకు తక్కువ రన్‌టైమ్ ఉండటం పెద్ద ప్లస్ పాయింట్ అవుతుందని, ఇది ప్రేక్షకులను ఎక్కడా బోర్ కొట్టించకుండా కథలో లీనమయ్యేలా చేస్తుందని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇక సినిమా కంటెంట్ విషయానికొస్తే, ఫస్ట్ హాఫ్ మొత్తం యువతను ఆకట్టుకునేలా యూత్‌ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో సాగుతుందని, సెకండ్ హాఫ్ మాత్రం హృదయానికి హత్తుకునే ఫ్యామిలీ ఎమోషన్స్ చుట్టూ తిరుగుతుందని శ్రీవిష్ణు స్వయంగా వెల్లడించారు. ఇప్పటికే 'సామజవరగమన', 'ఓం భీమ్ బుష్' వంటి బ్లాక్‌బస్టర్లతో మంచి ఫామ్‌లో ఉన్న శ్రీవిష్ణు, మరోసారి అదే తరహా వినోదాత్మక చిత్రంతో రాబోతుండటంతో అంచనాలు భారీగా ఉన్నాయి. మరో విశేషమేమిటంటే, అదే రోజు విడుదల కావాల్సిన ఆయన మరో సినిమా 'మృత్యుంజయ్' మార్చి 6కి వాయిదా పడటంతో 'విష్ణు విన్యాసం' చిత్రానికి బాక్సాఫీస్ వద్ద సొంత పోటీ తప్పి సోలో రిలీజ్ దక్కినట్లయింది. వాస్తు పిచ్చి ఉన్న ఓ యువకుడి కథాంశంతో సాగే ఈ వినోదాత్మక చిత్రం శ్రీవిష్ణు ఖాతాలో మరో హిట్ చేరుస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు.

## 'పెద్ది' పాటల సందడి



రామ్‌చరణ్ పాన్ ఇండియా చిత్రం 'పెద్ది' ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతున్నది. బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. జాన్వీకపూర్ కథానాయికగా నటిస్తున్నది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై భారీ హైప్‌ను క్రియేట్ చేశాయి. ముఖ్యంగా 'చికిరి' పాట సోషల్‌మీడియాలో రికార్డు స్థాయి వీక్షణలను దక్కించుకుంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం మ్యూజికల్ ప్రమోషన్స్‌ను ముమ్మరం చేయబోతున్నారు. మార్చి 2వ తేదీన 'రై రై రా రా' అనే రెండో పాటను విడుదల చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో రామ్‌చరణ్ పక్కా మాస్ అవతారంలో కనిపిస్తున్నారు. రూరల్ స్పోర్ట్స్ డ్రామాగా రూపొందిస్తున్న ఈ సినిమాలో రామ్‌చరణ్ ఆటకూలీ పాత్రను పోషిస్తున్నారు. ఏ.ఆర్.రెహమాన్ స్వరకల్పనలో పాటలన్నీ అద్భుతంగా తయారయ్యాయని, మ్యూజికల్‌గా కూడా బిగ్గెస్ట్ హిట్‌గా నిలుస్తుందని మేకర్స్ ఆశాభావం వ్యక్తం చేశారు. శివరాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందుశర్మ, బొమన్ ఇరానీ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఆర్. రత్నవేలు, సమర్పణ: మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, రచన దర్శకత్వం: బుచ్చిబాబు సాన.

## విజయ్ రష్మికల ఏడడుగుల బంధం



ఎప్పటినుంచో అభిమానులు ఎదురుచూస్తున్న తరుణం వచ్చేసింది. టాలీవుడ్ లవ్ బర్డ్స్ విజయ్, రష్మిక పెళ్లి బంధంతో ఒక్కటయ్యారు. గురువారం ఈ ఉదయం తెలుగు సంప్రదాయం ప్రకారం వీరిద్దరి పెళ్లి జరిగింది. సాయంత్రం కొడవ సంప్రదాయం ప్రకారం మరో సారి పెళ్లి వేడుక జరిగింది.

తాజాగా తమ పెళ్లి ఫోటోస్ షేర్ చేస్తూ తన భర్తను పరిచయం చేసింది రష్మిక మందన్నా.

గీతా గోవిందం ఒక్కటయ్యారు. ఫిబ్రవరి 26న రాజస్థాన్ లోని ఉదయ్ పూర్ లోని ఐటీసీ మెమోంటో హోటల్లో రష్మిక, విజయ్ ఏడడుగులు వేశారు. అతికొద్ది మంది సన్నిహితుల సమక్షంలో వీరిద్దరి వివాహం గ్రాండ్ గా జరిగింది. మార్చి 4న వీరి వివాహ రిసెప్షన్ హైదరాబాద్ లో జరగనున్న సంగతి తెలిసిందే. గీత గోవిందం సినిమాతో మొదలైన ఇద్దరి ప్రేమ ప్రయాణం ఇప్పుడు పెళ్లితో ఒక్కటయ్యింది. అల్లరితో మొదలైన సినీప్రయాణం ఒకరి కోసం ఒకరు నిలబడేలా చేసింది. ఇన్నాళ్లు నేషనల్ క్రష్ గా ఉన్న రష్మిక ఇప్పుడు విజయ్ దేవరకొండ ఇంటి మహాలక్ష్మిగా మారింది. రియల్ లైఫ్ మ్యారేజీతో ఒక్కటయ్యారు విజయ్, రష్మిక. అటు వెండితెరపై వీరిద్దరి జోడికి అభిమానులు ఫిదా అయ్యారు. అలా మొదలైన వీరి పరిచయం డియర్ కామ్రేడ్ సినిమాతో ప్రేమగా మారింది. ఇప్పటికే చాలా కాలం వీరిద్దరి ప్రేమ వార్తలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. కానీ ఇప్పుడు వీరు అధికారికంగా తమ బంధాన్ని ప్రకటించారు. ప్రస్తుతం విజయ్, రష్మిక పెళ్లి ఫోటోస్ వైరలవుతున్నాయి.

అయితే అంతకు ముందు వీరిద్దరు ఇన్ స్టా వేదికగా తమ ప్రేమ విషయాన్ని పరోక్షంగా వెల్లడిస్తూనే ఉన్నారు. పలు సందర్భాల్లో ఒకరిపై ఒకరికి ఉన్న అభిప్రాయాలను పంచుకుని అభిమానుల్లో జోష్ నింపారు. ఇక ఎట్టకేలకు తమ బంధం పేరు అభిమానులు పిలుచుకుంటున్న విరోష్ అంటూ అధికారికంగా ఫిబ్రవరి 22న వెల్లడించారు. ఫిబ్రవరి 26న పెళ్లి బంధంతో ఒక్కటయ్యారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో విజయ్ రష్మిక పెళ్లి వేడుక విరోష్ పేరు మారుమోగుతుంది.

## గ్లామర్ ఉన్నప్పుడే జాగ్రత్త..



ఆమె వెండితెరపై కనిపిస్తే కుర్రకారుకు పూనకాలే. 21 ఏళ్లుగా చిత్ర పరిశ్రమలో అగ్ర కథానాయికగా కొనసాగడం అంటే సామాన్యమైన విషయం కాదు. ఎందరో వస్తుంటారు, పోతుంటారు.. కానీ ఆమె మాత్రం తన స్థానాన్ని పదిలం చేసుకుంది. అయితే ఈ సక్సెస్ వెనుక కేవలం తన గ్లామర్ మాత్రమే లేదని, పక్కాగా వేసుకున్న ఆర్థిక ప్రణాళికలు ఉన్నాయని తాజాగా వెల్లడించింది. చేతి నిండా అవకాశాలు ఉన్నప్పుడే భవిష్యత్తు గురించి ఆలోచించాలని చెబుతున్న ఆ స్టార్ మరెవరో కాదు.. తమన్నా భాటియా. తండ్రి బాటలో..

తమన్నా తన 15వ ఏటనే కెరీర్ ప్రారంభించింది. అప్పట్నుండి ఆమె ఆర్థిక వ్యవహారాలను తన తండ్రి పర్యవేక్షించేవారు. "నా తండ్రి నాకు ఇచ్చిన మార్గనిర్దేశమే ఈరోజు నన్ను ఆర్థికంగా నిలబెట్టింది. సంపాదించిన ప్రతి రూపాయిని ఎలా పొదుపు చేయాలో, ఎక్కడ పెట్టుబడి పెట్టాలో ఆయన నేర్పిన క్రమశిక్షణే నా విజయ రహస్యం" అని తమన్నా పేర్కొన్నారు. నటీనటుల కెరీర్ ఎప్పుడూ ఒకేలా ఉండదని, అందుకే దూరదృష్టితో ఆలోచించాలని ఆమె సూచించారు. సినిమాల ద్వారా వచ్చే ఆదాయాన్ని తమన్నా కేవలం బ్యాంకుల్లో దాచుకోకుండా, తెలివిగా రియల్ ఎస్టేట్, జ్యువెలరీ బిజినెస్ వంటి రంగాల్లో పెట్టుబడిగా మళ్లించారు. ప్రస్తుతం ఆమె సొంతంగా నగల వ్యాపారాన్ని కూడా నిర్వహిస్తున్నారు. అవకాశాలు వరుస కడుతున్న సమయంలోనే ఇతర ఆదాయ మార్గాలను వెతుక్కోవాలని, లేనిపక్షంలో కెరీర్ చివరి దశలో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆమె తన సహచర నటీనటులను హెచ్చరించారు. ఆర్థిక వ్యవహారాల్లో ఎంత బిజీగా ఉన్నా, సినిమాల విషయంలో తమన్నా తన వేగాన్ని తగ్గించడం లేదు. ఈ ఏడాది ఆమె భారీ ప్రాజెక్టులతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. సిద్ధార్థ్ మల్హోత్రాతో కలిసి నటించిన 'వివాన్: ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్' మే 15న విడుదలకు సిద్ధంగా ఉంది. అలాగే అజయ్ దేవగణ్, సంజయ్ దత్ వంటి స్టార్లతో కలిసి 'రేంజర్' అనే చిత్రంలో ఒక కీలక పాత్రలో కనిపించనున్నారు. గ్లామర్ ప్రపంచంలో వెలుగులు ఉన్నప్పుడే భవిష్యత్తు గురించి ఆలోచించాలని తమన్నా చెప్పిన మాటలు అక్షర సత్యాలు. కేవలం నటులకే కాదు, ప్రతి ఒక్కరికీ ఆమె చెప్పిన ఆర్థిక క్రమశిక్షణ ఎంతో అవసరం.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**